


# విజయభాను




విశాఖపట్నం, గురువారం 28-06-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 275 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# మీ ఆరోగ్యం జాగ్రత్త

- ఇద్దరు నేతల ఆరోగ్యం విషమం
- దీక్షదారులను కలిసిన మంత్రి గంటా శ్రీనివాసరావు
- బీటెక్ రవి ఆమరణ నిరాహార దీక్ష భగ్నం
- స్పష్టమైన ప్రకటన వచ్చే వరకూ విరమించేది లేదు..
- శిబిరం వద్ద ఉద్రిక్తత



కడప: కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం గత ఎనిమిది రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్, ఎమ్మెల్సీ బీటెక్ రవి ఆరోగ్య పరిస్థితిపై మంత్రి గంటా శ్రీనివాసరావు అత్యవసర సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో కడపకు వచ్చిన ఆయన జిల్లా కలెక్టర్, ఎస్పీ, రిమ్స్ వైద్యులతో సమావేశమయ్యారు. ఇద్దరి నేతల ఆరోగ్యం విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారని మంత్రి చెప్పారు. ఎనిమిదో రోజు దీక్ష చేస్తున్న ఇద్దరిలో ఎమ్మెల్సీ బీటెక్ రవి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని, ఆయనకు తక్షణమే చికిత్స అందించకపోతే ప్రాణాలకు ప్రమాదమని వైద్యులు నివేదించారు. ఈ విషయాన్ని గంటా సీఎం చంద్రబాబు నాయుడుకు సమాచారం అందజేశారు. మరోసారి వైద్యబృందం, జిల్లా కలెక్టర్, ఎస్పీతో సమీక్షించి బీటెక్ రవిని బలవంతంగానైనా ఆస్పత్రికి తరలించే విషయాన్ని ఆలోచిస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు.



### స్పష్టమైన ప్రకటన వచ్చే వరకు విరమించబోం..

కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటుపై కేంద్రం నుంచి స్పష్టమైన ప్రకటన వచ్చే వరకు దీక్ష విరమించబోనని.. ఎలాంటి ప్రాణ త్యాగానికైనా సిద్ధమని బీటెక్ రవి మంత్రికి స్పష్టంచేశారు. ఈ విషయాన్ని మంత్రి గంటా ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. ఈ నేపథ్యంలో బలవంతంగానైనా ఆయనను ఆస్పత్రిలో చేర్పించే యోచనలో ఉన్నట్టు మంత్రి తెలిపారు.

### బీటెక్ రవి ఆమరణ నిరాహార దీక్ష భగ్నం

కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని

తరువాయి 2లో..

## ఉత్తరాంధ్ర మరో తెలంగాణ అవుతుంది

- ఉత్తరాంధ్రలో బతకలేని పరిస్థితుల్ని కల్పిస్తున్నారు
- సహజ వనరులని దోచేయడం పథకంలో భాగమే
- పాలకులు ఇలాగే నిర్లక్ష్యం చేస్తే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వస్తుంది
- ఉత్తరాంధ్ర మేథావుల చర్చల్లో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్




విశాఖపట్నం: ఆంధ్ర ప్రదేశ్‌లో భాగమైన ఉత్తరాంధ్ర మరో తెలంగాణ కావడానికి మరెంతో దూరం లేదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ట్విట్టర్ వేదికగా స్పందించిన ఆయన ఈ విధంగా స్పందించడం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. ఉత్తరాంధ్ర మాసపత్రికలో 2017 సెప్టెంబర్‌లో వచ్చిన కవర్ స్టోరీని ఉదహరిస్తూ ఆయన ఇలా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఉత్తరాంధ్ర ఆత్మగౌరవ ఉద్యమం మరింత ప్రబలే అవకాశం ఉందని కొన్ని సూచనలు కనిపిస్తున్నాయి. ఉత్తరాంధ్రపై ఇలాగే నిర్లక్ష్యం వహిస్తే.. మరో తెలంగాణ అవుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు అంటూ ట్వీట్ చేశారు. దానితో పాటు ఉత్తరాంధ్ర మాసపత్రికలోని రెండు సంచికల చిత్రాలను షేర్ చేశారు. థింసా సామాజిక మాస పత్రిక, తెలుగు సీమ ఆంగ్ల మాసపత్రికల చిత్రాలను కూడా షేర్ చేశారు.

తెలంగాణ ఉద్యమం కూడా ఇలాగే ప్రారంభమైంది. ఏపీ నేతల అధికారంలో తీవ్ర అణచివేత, క్రూరత్వం భరించి వారు రాష్ట్ర సాధన కోసం ఉద్యమం చేశారు. అదో మహత్తర ఉద్యమంగా రూపుదాల్చింది. చివరికి తెలంగాణ ఏర్పడింది. మరికొద్ది సంవత్సరాలు లేదంటే అంతకు ముందే ఉత్తరాంధ్ర కూడా ప్రత్యేక రాష్ట్ర అవుతుంది అని మరో ట్వీట్ చేశారు.

జనసేన పార్టీ ఏర్పాటు చేసిన అనంతరం పలు సందర్భాల్లో పవన్ కల్యాణ్ ఉత్తరాంధ్ర ప్రస్తావన తీసుకువచ్చారు. ఈ మధ్యే శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానం గ్రామంలో కిడ్నీ బాధితుల గురించి విశేష కృషి చేశారు.

పచ్చని భూములు, జల వనరులతో నిండి ఉన్న ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని పాలకులు కావాలనే నిర్లక్ష్యం చేసి అభివృద్ధికి దూరం చేశారని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆరోపించారు. పరిస్థితి ఇలానే కొనసాగితే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మాదిరిగానే ఉత్తరాంధ్ర ఉద్యమం కూడా వస్తుందని పవన్ హెచ్చరించారు. ఉత్తరాంధ్ర మేధావులతో బుధవారం విశాఖపట్నంలో జనస్వరం పేరిట చర్చా కార్యక్రమం జరిగింది. ఈ


తరువాయి 8లో..

## ఉక్కును కేంద్రం తాత్సారం చేస్తోంది

**అడిగిన ప్రశ్నలే మళ్లీ అడుగుతున్నారు**

**కేంద్రం మొండి వైఖరి వీడాలి**

**ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**



అమరావతి: అడిగిన ప్రశ్నలే రెండు, మూడు సార్లు అడుగుతూ ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేసే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తోందని సీఎం చంద్రబాబు నాయుడు విమర్శించారు. బుధ వారం ఆయన తెదేపా ఎంపీలు, కడపలో ఉక్కు దీక్ష నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహిం చారు. ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని కోరుతూ కడపలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన సీఎం రమేశ్, బీటెక్ రవిల ఆరోగ్యం గురించి

తరువాయి 2లో..



## ప్రతీ అడుగులోనూ ప్రజలు ఆశీర్వదించారు

**ఏపీ ప్రజలకు కృతజ్ఞతలు .. ప్రజాసంకల్పయాత్రలో వైఎస్ జగన్**

భీమనపల్లి (తూర్పుగోదావరి) : ప్రజాసంకల్పయాత్ర ప్రారంభమై 200 రోజులు పూర్తి అయిన సందర్భంగా బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. పాదయాత్ర చేయగలుగుతామా? అన్న పరిస్థితుల నుంచి సునాయాసంగా ముందుకు సాగగలుగుతున్నామని అన్నారు. దేవుడి దయ, ప్రజల దీవెన వల్ల మాత్రమే ఇది సాధ్యం అయిందని చెప్పారు. ప్రతి అడుగులోనూ నాన్నగారు తోడుగా ఉండి నడిపిస్తున్నట్టు ఉందని వెల్లడించారు.

వేసే ప్రతి అడుగులోనూ ప్రజలు ఆశీర్వదించారని, వారి ఆప్యాయతలు, ప్రేమానురాగాలు ఈ 200 రోజులపాటు నన్ను నడిపించగలిగాయని చెప్పారు. పాదయాత్రలో భాగంగా దారి పొడవునా తాను

తరువాయి 2లో..




### రైతుల లోగిళ్లలో సిరులకు శ్రీకారం

## ఏరువాక పూర్ణిమ

- రాష్ట్ర పండుగగా జిల్లాలోని 10 నియోజకవర్గాలలో నిర్వహణకు ఏర్పాట్లు
- అనంతవరం ఏరువాకలో పాల్గొంటున్న మంత్రి గంటా శ్రీనివాసరావు
- మర్రిపాలెం ఏరువాకలో పాల్గొంటున్న మంత్రి అయ్యన్న పాత్రుడు
- మూడు విడతలలో రుణ మాఫీ, ఇతర రుణాల పంపిణీ
- విశాఖ జిల్లా కలక్టర్ ప్రవీణ్ కుమార్





విశాఖపట్నంః అతి పురాతన కాలం నుండి అన్నదాతల పండుగ ఏరువాక పూర్ణిమ. నిజానికి రైతన్న ఇంట సిరులు కురిపించే పండగ. అందరికీ ఆకలి తీర్చే ఈ పండగ అందరిదీ. ఈ ఏడాది జ్యేష్ఠ శుద్ధ పూర్ణిమ అయిన జూన్ 28న దీనిని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని విశాఖ జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ప్రస్తుత తరానికి ఏరువాక అనే పదానికి అర్థం తెలియక పోవచ్చునని, ఏరు అంటే ఎద్దులను కట్టి దున్నుటకు సిద్ధమవడం, వాక అంటే దున్నడం ప్రారంభించడమని తెలిపారు. దీనిని ఒక పవిత్ర కార్యంలా నిర్వహించే అన్నదాతకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందనే మనోధైర్యాన్ని రైతుల్లో కల్పించేందుకే ప్రభుత్వం ఈ ఏరువాక పూర్ణిమను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

**10 నియోజకవర్గాల్లో పండుగలా ఏరువాక పూర్ణిమ**

జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో ఈ ఏరువాక పూర్ణిమను ఒక పవిత్ర యజ్ఞంలా ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు.

తరువాయి 2లో..



# గుట్టలు గుట్టలుగా దొరుకుతున్న గుట్కా

### అనకాపల్లి పరిసరాలలో భారీ నిల్వలు

అనకాపల్లి : అనకాపల్లి పరిసరాలలో భారీగా గుట్కా నిల్వలు పేరుకుపోయినట్లు దొరుకుతున్న అక్రమ గుట్కాయే నిదర్శనం. అనకాపల్లి కేంద్రంగా పెద్ద ఎత్తున నిల్వలు ఉన్నట్లు ఈ సంఘటనలు రుజువు చేస్తున్నాయి. ఒక గ్రామీణ జిల్లా అంతటికి, ఇక్కడి నుండే అక్రమ గుట్కా సరఫరా అవుతుందని తెలుస్తుంది. పెరుగుబజార్ జంక్షన్ కేంద్రంగా పెద్ద ఎత్తున ఈ వ్యాపారం జరుగుతుందని పోలీసులు ఒక నిర్ధారణకు వచ్చారు. ఇప్పటికే వెంకుపాలెం, తుమ్మపాల, స్టేషన్ రోడ్ వంటి ప్రాంతాలలో ఈ మధ్య కాలంలో లక్షలాది రూపాయుల గుట్కాలు పట్టుకోవడం జరిగింది.

ఎక్కడ దొరికిన సుమారు 20 నుండి 50లక్షల రూపాయలు సరుకు పట్టుబడు తుందంటే ఎంత పెద్ద మొత్తంలో వ్యాపారం జరుగు తుందో ఊహించ వచ్చును. రాష్ట్రంలో గుట్కాను నిషే దించడంతో ఇతర రాష్ట్రాల నుండి అక్రమంగా, సరు కును దిగుమతి చేసుకుంటూ, అధికారుల అండదం డలతో యద్దేశ్చగా వ్యాపారం చేస్తున్నారు. రూపాయి గుట్కా ప్యాకెట్ 10 రూపాయలకు అమ్ముతూ పెద్ద ఎత్తున అక్రమార్కులు ఆర్జిస్తున్నారు. నిషేదించ బడిన గుట్కా, కైనీ, పాన్‌పరాక్, లేని కిల్లీబడ్డి, కిరాణా కొట్టు లేదంటే అతి శయోక్తి కాదు. ఈ విషయం అందరికీ తెలిసినా, పట్టించు కోవడం లేదు. ఇటీవల, దొరికిన, గుట్కాను దొడ్డిదారిన, విడిచి పెట్టారని ఆరోపణతో అనకాపల్లి సిఐని కూడా విఆర్‌లో పెట్టిన సంగతి విధితమే. దీని బట్టి చూస్తే, గుట్కా వ్యాపారులు అధికారులను ఎలా మేనేజ్ చేస్తున్నారో ఊహించవచ్చును. సుమారుగా అనకాపల్లి నుండి నెలకు 50 కోట్ల రూపా యలు పైబడి గుట్కా వ్యాపారం జరుగు తుందని అంచన. విజిలెన్స్ అధి, కారులు అనకాపల్లిపై ప్రత్యేక దృష్టిని కూడా సారించడం జరిగింది. పూల్‌బాగ్, తుమ్మపాల, అనకాపల్లి వంటి ప్రాంతాలలో గొడౌనులను అద్దెకు తీసుకుని, పెద్ద ఎత్తున నిల్వలు చేసారు. వీటిని గుట్టు చప్పుడు కాకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఏది



ఏమైనా అనకాపల్లిలో గుట్టలు గుట్టలుగా గుట్కా దొరుకుతుండడం జిల్లా దృష్టిని ఆకర్షిస్తుంది. పోలీసులు పూర్తి స్దాయిలో దృష్టిసారించి పెద్ద ఎత్తున ఉన్న గుట్కా నిల్వలను స్వాదీనం చేసుకోవాలని స్దానికులు కోరుతున్నారు.

## పంచాయతీలలో వ్యర్ధ నిర్వహణ యార్డుకు స్థలాలు

### ఆర్డీవో విశ్వేశ్వరరావు



మాట్లాడుతున్న ఆర్డీవో విశ్వేశ్వరరావు

నర్సీపట్నం : గ్రామాలలో ఘన వ్యర్ధ పదార్థాల నిర్వహణ(సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెట్) యార్డులకు స్థలాలు తప్పకుండా మంజూరు చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారి వి.విశ్వేశ్వరరావు ఆదేశించారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహణ యార్డుల పురోగతిపై డివిజన్లోని అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఒలు, ఈఒపిఆర్‌డి ఉపాధి హామీ ఏపిఒలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించి ఐదు లేక ఆరు సెంట్ల స్థలాన్ని నిర్వహణ కేంద్రానికి అప్పగించాలన్నారు. మండల స్థాయి అధికారులు సమన్వయంతో తగిన స్థలాన్ని గుర్తించాలన్నారు. నీరు చేరనటువంటి మెరక ప్రాంతంలో ఉన్న చెరువు స్థలాన్ని ఉపయో గించుకోవచ్చని సూచించారు. భూమి అందు బాటులో లేనట్లయితే 4 సెంట్ల స్థలంలో కూడా నిర్మించుకోవచ్చని, లేదా పంచాయతీ కార్యాలయం, అంగన్వాడి లేదా ఇతర కార్యాలయాల ఆవరణలో ఉన్న స్థలాలను కూడా పరిగణనలోనికి తీసుకోవచ్చు అన్నారు. స్థలాన్ని గుర్తించి తుది నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత గ్రామ సర్పంచ్ కి తెలియ జేయా లన్నారు. గుర్తించిన స్థలాన్ని వెంటనే ఎంపీడీవో కు అప్పగించాలని, ఎటువంటి ఆక్షేపణలు ఉన్న తహశీల్దార్ పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్. రాయవరం, కోటవురట్ల, రావికమతం మండ లాల్లో ఎక్కువ పంచా యతీలకు స్థలాలు మంజూరు జరగలేదని, తహశీల్దార్, ఎంపీడీ వోలు తక్షణం తగిన చర్యలు చేపట్టి రేపటిలోగా పూర్తిచేయాలని ఆదేశించారు. మండలంలో గల పంచాయతీలు, గుర్తించినవి, గుర్తించవలసిన గ్రామాలను డివిజనల్ పంచా యతీ అధికారి కి రేపు సాయంత్రం లోగా తెలియజేయాలని ఆదేశించారు. ఈ కార ్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారిణి శిరీష రాణి, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఈఒపిఆర్‌డి, ఉపాధిహామీ ఎపిఓలు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వం సబ్సిడితో ఇచ్చే విత్తనాలను

## రైతులు వినియోగించుకోవాలి

### ఎంపీపీ మాసవరపు



పరవాడ: ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వము సబ్సిడీతో ఇచ్చే విత్తనాలను రైతులు అందరూ వినియోగించుకోవాలని ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు అన్నారు. బుధవారము ఆయన స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సాంబ మసూరి, శ్రీకాకుళం సన్నాలు వరి విత్తనాలను రైతులుకు పంపిణీ చేశారు. అనంతరము ఆయన మాట్లాడుతూ ఎన్నడు లేని విధంగా వరి విత్తనాలను ప్రభుత్వము ఎక్కువ సబ్సిడీతో ఇస్తుందని అన్నారు. క్రిందట సంవత్సరము వరివిత్తనాలు కిలోకి ఐదురూపాయలు సబ్సిడీ ఇవ్వగా, ఈ సంవత్సరము కిలోకి పది రూపాయలు సబ్సిడీ ప్రభుత్వము ఇస్తుందని అంతేకాక భూమిలో సూక్ష్మ పోషకమైన జింక్ ను ప్రభుత్వము రైతులు అందరికీ ఉచితంగా ఇస్తుందని అన్నారు. రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగము చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి పోతల సత్య నారాయణ, జిల్లా తెలుగు యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి వియ్యపు చిన్నా, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పైల రామచంద్రరావు, రెడ్డి శ్రీనువాసురావు, చుక్క సన్యాసిరావు పాల్గొన్నారు.

## ఏరియా ఆసుపత్రికి అంతర్జాతీయ నాణ్యత బృందం



నర్సీపట్నం : అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం బుధవారంనర్సీపట్నం ఏరియా ఆసుపత్రిని పరిశీలించి. 27, 28, 29 తేదీల్లో వారు పర్యటించి ప్రతి వార్డు, ఆసుపత్రి పరిస రాలు, వాతావరణం నాణ్యత ప్రమాణాలను తీసుకుని వాటిలో సరైన పాయింట్స్ ఇవ్వనున్నారు. అనంతరం బృందం వైద్యులు, స్టాఫ్ నర్సులు, సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై పరిశీలన అంశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం డాక్టర్ కార్తీక్, డాక్టర్ రేణి లారియాజియోలే, ఎల్‌కె కోహకర్‌లు, డాక్టర్ సుధా శారదా పాల్గొన్నారు.

## విత్తన శుద్ధి ప్రాధాన్యత గుర్తించాలి

యలమంచిలి రూరల్ : విత్తనశుద్ధి ప్రాధాన్యతను రైతులు గుర్తించాలని కొండెంపూడి కెవికె శాస్త్రవేత్త సీనియర్ శాస్త్రవేత్త చంద్ర నాయుడు అన్నారు. నారాయణపురంలో బుధవారం రిలయన్స్ పౌండేషన్, కొండెంపూడి కెవికె ఆధ్వర్యంలో రైతు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తొలుత నాణ్యమైన విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలన్నారు. ఎంపిక చేసిన విత్తనాన్ని విత్తనశుద్ధి చేసిన తర్వాత నారుమడిలో జల్లుకోవాలన్నారు. శాస్త్రవేత్త తేజేశ్వరరావు మాట్లాడుతూ వరిలో తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరి పంటను ఆశించే తెగుళ్లు, సస్యరక్షణ చర్యలను వివరించారు. రిలయన్స్ పౌండేషన్ జిల్లా మేనేజర్ జి.తిరుమలరావు మాట్లాడుతూ వ్యవసాయం, వాతావరణం సమాచారం, ప్రభుత్వ పథకాలు, ఉద్యోగ సమాచారం సలహాలు, సూచనల కొరకు తమ టోల్‌ఫ్రి నెంబరు 18004198800ను సంప్రదిస్తే ఉచితంగా సమాచారం అందు తుందన్నారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ పౌండేషన్ ప్రోగ్రాం సపోర్టర్ వి.రాము, రైతు నాయకులు పి.సూర్యనారాయణ, బి.సత్య నారాయణ, రవిరాజు, పెంటకోట సూర్యనారాయణ ఉన్నారు.

## దాడి జన్మదినానికి భారీ ఏర్పాట్లు



అనకాపల్లి : మాజీ మంత్రి దాడి వీరభద్రరావు జన్మదినోత్సవ కార్య క్రమాన్ని జూలై 3 న ఘనంగా నిర్వహించేదుకు అవస రమైన ఏర్పాట్లులో అభిమానులు ఉన్నారు. రింగ్‌రోడ్‌లో పార్టీ క్యాంపు కార్యాలయంలో ఈ మేరకు ఆత్మీయ సమావేశం జరి గింది. ఈ సమావేశానికి నియోజక వర్గం నలు మూలల నుండి పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొని ఘనంగా పుట్టినరోజు నిర్వహిం చేందుకు తీర్మానించారు. 31 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయం, 20 సంవత్సరాలు ఎమ్మెల్యేగా, ఆరు సంవత్సరాలు శాసన మండలి ప్రతిపక్ష నేతగా పనిచేసిన దాడి వీరభద్రరావుకు శుభాకాంక్షలు తెలుపుతూ పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు సేవా కార్యక్రమాలు నిర్వహిం చాలని నిర్ణయించారు.

### విత్తనాల కోసం రైతుల నిరీక్షణ

నాతవరం : స్థానిక కోఆపరేటివ్ బ్యాంక్ వద్ద విత్తనాల కోసం రైతులు నిరీక్షిస్తున్నారు. ఈ ఖరీప్‌కు సరిపడా వరి విత్తనాలు రాలేదు. దీంతో రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు పట్టుకొని తిరుగుతున్నారు. ముందుగా రతులు వ్యవసాయ కార్యాలయానికి వెళ్లి విత్తనాల కోసం చీటీలు రాయించుకొని కోఆపరేటివ్ బ్యాంకు వద్దకు వెళుతున్నారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని జిల్లా అధికారులు సరిపడా విత్తనాలు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

### పిత్రిగెడ్డలో జ్వరాలు

రోలుగుంట : మండలంలోని లోసింగి శివారు పిత్రిగెడ్డ గ్రామస్థులు జ్వరాలతో మంచం పట్టారు. ప్రతీ ఇంటిలో ఒకరిద్దరు అనారోగ్యం బారిన పడి బాధపడుతున్నారు. మూడు రోజులుగా వాంతులు, విరేచనాలు జ్వరాలతో అవస్థలు పడుతున్నారు. గ్రామానికి చెందిన కొర్రా బుజ్జమ్మ, కిల్లో లక్ష్మి, కిల్లో రాము, కిల్లో బాబులు, కొర్రా లక్ష్మి, మర్రి దివ్య, కొర్రా శివ, కొర్రా కౌలు, మర్రి సురేష్, మర్రి ఆది, రమేష్‌లు మలేరియా జ్వరంతో బాధపడు తున్నారు. ఆసుపత్రికి వెళ్లే అవకాశం లేక ఇంటి వద్ద చికిత్స చేయించుకుంటూ జ్వరాలతో మరింత తీవ్రతరం చేసుకుంటు న్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

### చర్చిల మరమ్మత్తులకు నిధులు మంజూరు

గొలుగొండ : చర్చిల మరమ్మత్తులకు నిధులు మంజూరైనట్లు ఎంపిడిఒ ఎంవి.సువర్ణరాజు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో గల చర్చిల మరమ్మ త్తులకు గాను ప్రభుత్వం రూ.20లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసిందన్నారు. ఏఎల్‌పురం ఆంధ్రా బాపిస్ట్ చర్చికు రూ.3.50లక్షలు, గొలుగొండ మినిస్టరీ చర్చికు రూ.1.50లక్షలు, కె.ఎల్లవరంలో పెంతకొస్ట్ చర్చికు రూ.70వేలు, కేడిపేట బైబిల్ చర్చికు రూ.6లక్షలు, పప్పుశెట్టిపాలెం పీతర్ చర్చికు రూ.6లక్షలు, గింజర్తి ప్రెయర్ హాల్‌కు రూ. 3లక్షలు నిధులు మంజూరయ్యా యన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మర మ్మత్తులు చేపట్టాల్సి చర్చిలు ఉంటే సంబంధిత వ్యక్తులు దరఖాస్తులు అందించాలని కోరారు.

### చంద్రన్న బీమా పంపిణీ

రావికమతం : గంపవానిపాలెంలో మిత్తాన ఈశ్వరమ్మ మంగళవారం జ్వరంతో మృతి చెందింది. ఈమేరకు ఈశ్వరమ్మ భర్త ఈశ్వరరావుకు తక్షణ సాయంగా రూ.5వేల నగదును సర్పంచ్ మాకిరెడ్డి రాజు చేతుల మీదుగా అందజేశారు. మిగతా రూ.1.95 లక్షలను పెద్ద ఖర్మ రోజున బాండ్ రూపంలో అందజేస్తామని మండల బీమా మిత్ర పుష్ప చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లంక రాజిబాబు, టిడిపి గ్రామశాఖ అధ్యక్షుడు బడ్డు చిన రమణ, వార్డు సభ్యులు చిరికి చినరాజిబాబు, బీమా మిత్ర పుష్ప, వెలుగు విఒ చంద్రకళ ఉన్నారు.

మొదటి పేజీ తరువాయి

## రైతుల లోగిళ్లలో సిరులకు శ్రీకారం ఏరువాక పూర్ణిమ

నర్సీపట్నం పరిధిలో నాతవరం మండలంలో మర్రిపాలెం గ్రామంలో నేడు ఉదయం 9.00 గంటలకు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి సిహెచ్. అయ్యన్నపాత్రుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెటపారు. భీమిలి నియోజకవర్గం పరిధిలోని పద్మనాభం మండలం అనంతవరం గ్రామంలో రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రారంభిస్తారన్నారు. అదే విధంగా చోడవరం, మాడుగుల, అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట, పెందుర్తి, అరకు, పాడేరు తదితర ఎనిమిది నియోజకవర్గాల్లో స్థానిక శాసన సభ్యుల నేతృత్వంలో ఈ ఏరువాక పూర్ణిమను ప్రారంభించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఆధునిక వ్యవసాయ స్టాళ్ళను ఏర్పాటు చేసి రైతులకు యాంత్రిక పద్దతుల ద్వారా పంటలు పండించేందుకు మెరుగైన పద్ధతులను అవలంబించడం తెలియజేస్తారని కలెక్టర్ తెలిపారు.

**విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు, పనిముట్ల పంపిణీ**

రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్న ఏరువాక పూర్ణిమలో భాగంగా పలు రాయితీలపై విత్తనాలు, ఎరువులను రైతులకు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశ్యంతో వరి, వేరుశనగ, పచ్చిరొట్ట, విత్తనాలు సరఫరా చేశామని సమగ్ర సూక్ష్మ పోషక యాజమాన్యం కింద శత శాతం రాయితీపై 261 మెట్రిక్ టన్నుల జింకు సల్ఫేటు, 127 మె.ట. జిప్సం, 5 మె.ట. బోరాన్ తదితరాలు పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. రైతులకు భూసార ఆరోగ్య కార్డులను అందజేశామని అన్నారు. మట్టి నమూనాలు పరీక్షించి అధిక వ్యవసాయానికి, దిగుబడులకు పనిముట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. రుణ మాఫీ చేసి, కొత్త రుణ సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని కలక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. జాతీయ ఆహార భద్రతా మిషన్ పథకం కింద వరి, అపరాలు వివిధ క్షేత్రాలో ప్రదర్శన క్షేత్రాలుగా నిర్వహించడం జరుగుతుందన్నారు.

## మీ ఆరోగ్యం జాగ్రత్త

బీటెక్ రవి చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు. గత ఎనిమిది రోజులుగా ఆమరణ దీక్ష చేస్తున్న ఆయన ఆరోగ్యం ఆందోళనకరంగా మారింది. సుగర్, బీపీ స్థాయి ప్రమాదకర స్థాయికి చేరడంతో తక్షణమే చికిత్స అందించకపోతే ఆయన ప్రాణాలకే ప్రమాదమని వైద్యులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన పోలీసులు భారీగా దీక్షా స్థలి వద్దకు చేరుకొని రవి దీక్షను భగ్నం చేశారు. ఎంపీ సీఎం రమేశ్‌ను సైతం ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా.. తెదేపా శ్రేణులు తీవ్రంగా ప్రతిఘటించాయి. దీంతో బీటెక్ రవిని వైద్య చికిత్సల నిమిత్తం కడప రిమ్స్ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ తన దీక్షను కొనసాగిస్తున్నారు.

దీక్షా స్థలి వద్ద ఉద్రిక్తత

బీటెక్ రవి ఆరోగ్య పరిస్థితి విషమించిన నేపథ్యంలో పోలీసులు ఆయన దీక్షను భగ్నం చేసేందుకు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల నడుమ రవిని పోలీసులు బలవంతంగా అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. ఈ ఉదయం నుంచి రవి ఆరోగ్యం తీవ్ర ఆందోళనకరంగా ఉన్నట్టు వైద్యులు నివేదించడంతో దీనిపై సమీక్షించిన మంత్రి గంటా శ్రీనివాసరావు.. బీటెక్ రవికి అత్యవసర చికిత్స అవసరమని స్పష్టంచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రమేశ్, రవితో మాట్లాడి మంత్రులు ఒప్పించేందుకు ప్రయత్నించినా.. కడప ఉక్కు పరిశ్రమ కోసం తాము ప్రాణ త్యాగాలకైనా సిద్ధమని, కేంద్రం నుంచి స్పష్టమైన ప్రకటన వచ్చేంత వరకు దీక్షను విరమించబోమని తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో రవి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మరో మార్గం ద్వారా ఆందోళను కొనసాగిద్దాం.. ఇప్పటికైతే విరమించాలని మంత్రులు కోరారు. అందుకు వారు ససేమిరా అనడంతో పోలీసులు బలవంతంగా బీటెక్ రవిని కడప రిమ్స్‌కు తరలించారు.

***కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు***

విభజన చట్టంలో పేర్కొన్న హామీని నెరవేర్చాలని దీక్ష చేపడితే కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదంటూ తెదేపా శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి, మోదీకి వ్యతిరేకంగా ఆ పార్టీ కార్యకర్తలు నినాదాలు చేశారు.

## ప్రతీ అడుగులోనూ ప్రజలు ఆశీర్వదించారు

చూసిన సమస్యలు బాధకలిగించాయని వెల్లడించారు. రుణాలు మాఫీ కాక, గిట్టుబాటు ధరలు రాక రైతులు ఇబ్బంది పడుతున్నారని వివరించారు.

రైతులను ప్రభుత్వం మోసం చేసింది. విద్యార్థులు నాన్నగారి పాలనను గుర్తుకు తెచ్చుకుంటున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక ఇబ్బంది పడుతున్నారు. ఆరోగ్య శ్రీ ఉందా? లేదా? అన్న పరిస్థితిని చూసి పేదలు అవస్థలు పడుతున్నారు. ఇళ్లు లేక పూరి గుడిసెల్లోనే పేదలు నివసిస్తున్నారు. ఇలా ఏ సమస్య చూసినా మనసును కలచివేసే సన్నివేశాలు నాకు పాదయాత్రలో కనిపించాయి. ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడంవల్ల ఈ సమస్యలన్నీ ఉత్పన్నమయ్యాయి.

ప్రజలకు మంచిచేయాలన్న ఆలోచన ఇప్పటి ప్రభుత్వానికి లేదు. దేవుడు ఆశీర్వదించి, కోట్ల మంది ప్రజలు దీవిస్తేనే ముఖ్యమంత్రి పదవి వస్తుంది. అలాంటి సీట్లో కూర్చున్నప్పుడు ప్రజలకు ఏం చేయాలన్న దానిపై ఇప్పటి ముఖ్యమంత్రికి ఆలోచనలు కరువయ్యాయి. ఇక రేపు లేదు అన్నట్టుగా సీఎం సీట్లో ఉన్న వ్యక్తి ప్రజల కోసం పరితపించాలి. మనం చనిపోయాక ప్రజల గుండెల్లో నిలిచిపోవాలని ఆరాటపడాలి. కానీ, అలాంటి పాలన ఇప్పుడు కనిపించడంలేదు. ఈ పరిస్థితులను చూసి నా మనసు చలించిపోతోంది.

వచ్చే మంచి రోజుల గురించి పాదయాత్రలో ప్రజలకు భరోసా నిచ్చాం. నవరత్నాలు వస్తాయి, రాజన్న రాజ్యం వస్తుందని ప్రజలకు నమ్మకాన్ని ఇచ్చాం. ప్రజలు ఆ రోజు కోసం ఎదురు చూస్తున్నారు. 200 రోజుల పాటు ప్రజలు చూపిన ప్రేమాభిమానాలను మరిచిపోలేను. నాకు అవకాశం వచ్చినప్పుడు ప్రజల రుణాన్ని తీర్చుకుంటాను. నాన్నగారి పాలన, అంతకన్నా గొప్ప పాలన ఇవ్వడానికి శాయశక్తులా ప్రయత్నిస్తా.

ప్రతి ఒక్కరికీ పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు. ప్రజలు ఇచ్చిన స్ఫూర్తి, ప్రేమ, ఆప్యాయతలు నన్ను 200 రోజులు నడిపించాయి. ఇంకా ఇచ్ఛాపురం వరకూ ప్రజాసంకల్పయాత్ర పోవాలి. దీనికి ముందడుగు.. ప్రజల ఆశీర్వదంతోనే పడుతుంది. అని వైఎస్ జగన్ తన పాదయాత్ర అనుభవాలను ప్రజలతో పంచుకున్నారు.

## ఉక్కును కేంద్రం తాత్సారం చేస్తోంది

ముఖ్యమంత్రికి మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి వివరించారు. ఆరోగ్య పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా మారడంతో దీక్షను భగ్నం చేసి ఆస్పత్రిలో చేర్పించిన బీటెక్ రవికి అందిస్తున్న చికిత్సపై సీఎంకు పలువురు మంత్రులు వివరించారు. ఉక్కు శాఖ మంత్రితో చర్చల సారాంశాన్ని సీఎంకు వివరించిన జేసీ.. ఉక్కు పరిశ్రమపై దిల్లీలో ఆందోళన ఉద్ధృతం చేస్తామని వెల్లడించారు. రేపు మరోమారు కేంద్రమంత్రి బీరేంద్రసింగ్‌ను కలవనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్రమంత్రికి తాను మరో లేఖ రాస్తానని, రేపటి భేటీలో ఆ లేఖను ఆయనకు అందజేయాలని సూచించారు.

కేంద్రం మొండి వైఖరి వీడాలి

2020లోగా మూడు గనులు రాష్ట్ర ప్రభుత్వం నియంత్రణలోకి వస్తాయని, ప్రస్తుతం ఇచ్చిన భూముల్లో 87 మిలియన్ టన్నుల ఖనిజం ఉందన్నారు. మూడు గనులు అందుబాటులోకి వస్తే 266 మిలియన్ టన్నుల నిక్షేపాలు ఉంటాయని వెల్లడించారు. ఉక్కు పరిశ్రమ పెట్టేందుకు 150 మిలియన్ టన్నులు ఉంటే సరిపోతుందన్నారు. 116 మిలియన్ టన్నుల నిక్షేపాలు ఉంటే ఇంకా కేంద్రానికి అభ్యంతరం ఎందుకు?అని ప్రశ్నించారు. కర్మాగారం పూర్తిచేసేందుకు రెండేళ్లు పడుతుందని, ఆ లోపు మిగిలిన మూడు గనులు రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోకి వస్తాయని ముఖ్యమంత్రి వివరించారు. ఉక్కు దీక్ష ప్రారంభమయ్యాక కేంద్రం మరో రెండు కొత్త కొర్రీలు వేసిందని, మొన్నటి దాకా తెలంగాణ ప్లాంట్‌పై స్పష్టత లేదన్నారని ఈ సందర్భంగా చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. బయ్యారం భూములు, నీళ్ల వివరాలు రాలేదన్నారని తెలిపారు. కడపలో రాష్ట్రం ఇచ్చే భూములపై ఏ వివాదమూ లేదని స్పష్టంచేశారు. కానీ, కావాలనే కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా తాత్సారం చేస్తోందని మండిపడ్డారు. విభజన చట్టంలో హామీ నెరవేర్చేందుకు ఎందుకీ జాప్యమని నిలదీశారు. రాష్ట్రం పట్ల కేంద్రం తన మొండి వైఖరిని వీడి హామీలు నెరవేర్చాలని చంద్రబాబు కోరారు.

### 6న పుదువైకి ఉపరాష్ట్రపతి రాక

పుదుచ్చేరి : స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ప్రారం భోత్సవానికి ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు జులై ఆరో తేదీన విచ్చేయనున్నారు. ఈ మేరకు రాజ్‌నివాస్ వర్గాలు ఒక ప్రకటన విడుదల చేశాయి.


GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION

'e' Procurement Tender Notice No.14/2018-19/S.E(W)/E.E-VI/DB/Dt:25-06-2018

| | | |
|---|---|---|
| 01. | Number of Works | : 14 Nos |
| 02. | Value of Works | : Rs.9412895/- |
| 03. | Down Loading Starting Date | : 25.06.2018 @ 03.00 PM |
| 04. | Down Loading End Date | : 03.07.2018 @ 04.00 PM (Item No:12) 10.07.2018 @ 04.00 PM (Item No:01 to 11) & (13 &14) |

Note: For any other details required in respect of above Tender Notice, please contact E.E-VI before applying for tender schedules and visit us : @ www.apeprocurement.gov.in website. Superintending Engineer (W)

బహిరంగ మలవిసర్జనను నిర్మూలిద్దాం

# సీఎం దత్తత గ్రామంలో డెంగ్యూ పంజా..

- విశాఖ ఏజెన్సీలో హెల్త్ ఎమర్జెన్సీ వెంటనే ప్రకటించాలి
- సిపియం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్

విశాఖపట్నంః మన్యంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి, అరుకు మండలం సిఎం దత్తత పంచాయితీ పెదలబడులో డెంగ్యూతో ఒక మహిళ మరణించారు. దీంతో అరుకు మండల కేంద్రవాసులు భయాందోళన చెందుతున్నారు కావున రాష్ట్ర ముఖ్యమంత్రి దత్తత తీసుకున్న పంచాయితీలోనే ఈ విధంగా వుంటే మిగిలిన గ్రామాల్లో జ్వరాలు ఏ స్థాయిలో వుంటాయో అర్ధం చేసుకోవాలి. కావున, వెంటనే ఏజెన్సీ వ్యాప్తంగా హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం డిమాండ్ చేశారు.

గతంలో విశాఖ ఏజెన్సీలో 24 గంటలు వైద్యం గిరిజనులకు అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం నిర్వహించింది. దీనివల్ల గిరిజనుల ఆరోగ్య పరిస్థితిలో ఎటువంటి మార్పు రాలేదు. ఏజెన్సీలో వున్న పరిస్థితులకు అనుగుణంగా పూర్తిసాయి వైద్య సిబ్బందిని, మౌళిక వసతులను మెరుగుపర్చి, ఖాళీగా వున్న వైద్య సిబ్బంది, స్పెషలిస్టు డాక్టర్లను వెంటనే నియమించాలి. అరుకు ఏరియా ఆసుపత్రిలో 7 డెంగ్యూ కేసులు నమోదు అయ్యాయి. సిహెచ్‌సిల్లో రక్తపరీక్షల రిపోర్టులు సకాలంలో రావడంలేదు. దీంతో ఏ మాత్రం జ్వరం వచ్చినా గిరిజన ప్రజలందరూ ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రైవేట్ ఆసుప్పత్రులు రక్తపరీక్షలకు తమఇష్టానుసారం ఫీజులు గుంజుతున్నారు. ప్రతి సిహెచ్‌సి, పిహెచ్‌సిల్లో రక్తపరీక్షలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే రిపోర్టులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. పారిశుద్యం సమస్య, మలేరియా స్ప్రేయింగ్ చేయకపోవడంతోనే డెంగ్యూ విజృంబిస్తుంది.

కావున ప్రభుత్వం వెంటనే జోక్యంచేసుకొని మొత్తం ఆరోగ్య పరిస్థితిపై సమీక్ష నిర్వహించి వైద్య సిబ్బంది నియామకాలు చేపట్టి. వ్యాధులు తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో వైద్యశిభిరాలు ఏర్పాటు చేయాలి.

మందులు అందరికీ అందుబాటులో ఉండేటట్లు చర్యలు చేపట్టాలి. సంతల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలి. పూర్తి స్థాయి వైద్య సిబ్బందిని, మందులను అందుబాటులో వుంచాలి. ఏజెన్సీ వ్యాప్తంగా మలాథియాన్ స్ప్రేలు చేయించాలి. దోమతెరలు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని సిపిఎం కమిటీ డిమాండ్ చేస్తోందన్నారు.



గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్ విశాఖపట్నంలో 2వ వార్డు పరిధిలో ఉన్న శ్రీ బాలా త్రిపుర సుందరి సహిత మల్లేశ్వరస్వామి ఆలయ 27వ వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారి పూజా కార్యక్రమంలో పాల్గొన్న వంశీ మరియు ఆలయ కమిటీ పెద్దలతో వైకాపా నాయకులు

## రేఖవానిపాలెంలో డెంగ్యూజ్వరం

భీమునిపట్నంః భీమిలి మండలం రేఖవానిపాలెం పంచా యితీలో ముగ్గురు పిల్లలకు డెంగ్యూ జ్వరం రావడంతో వారిని భీమిలి ఎం.పి.పి యర బాల క్రిష్ణవేణి, సర్పంచ్ శ్రీను,వి.ఆర్ డి.ఓ, ఆర్.వి.ఎల్.ఎన్ కుమార్ ,కార్యదర్శి నూర్జహాన్ లు అక్కడకి వెళ్లి వారిని పరామర్శిం చారు. ఎం.పి.పి మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా వుండాలంటే పరిసరాలు పరిశు బ్రంగా వుంచుకోవాలని ,దోమలు నివారణకు తగు చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను అదేశించారు. అలాగే ముగ్గురు పిల్లలకు కి మెరుగయిన వైద్యం అందిచాలని సూచించారు.


## అచ్యుతాపురంలో హెరిటేజ్ రైతు సంక్షేమ నిధి శాశ్వత ట్రస్ట్ నారా బ్రహ్మణి



అచ్యుతాపురం: మండల కేంద్రమైన అచ్యుతాపురంలో బుధవారం హెరిటేజ్ రైతు సంక్షేమ నిధి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా క్యాంపులో నారా బ్రహ్మణి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెరిటేజ్ రైతు సంక్షేమ నిధి సభ్యులైన పాడిరైతుల పిల్లల్లో 10వతరగతిలో ప్రతిభ చూపిన విద్యార్ధులకు మెరిట్ అవార్డులు, మృత్యువాతపడిన కుటుంబాలకు బీమా సొమ్ము పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెరి టేజ్ ట్రస్టు హెడ్ ఎ.శ్రీనువాసు, రీజనల్ హెడ్ పి.నాగ అప్పారావు, అచ్యుతాపురం శాఖా మేనేజర్ కూంద్రపు శేషు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## గ్రామ పెద్ద ఆళ్ల మృతి

అనకాపల్లి : పట్టణంలో విజయరామరాజుపేటకు చెందిన గ్రామ కమిటీ చైర్మన్ ఆళ్ల వీరునాయుడు అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. గత కొంత కాలంగా, అనారోగ్యం వేదిస్తుం డడంతో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈయన గ్రామంలోని మరిడిమాంబ అమ్మవారి ఆలయకమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.



# సామాజిక కార్యక్రమాలు చేపట్టడం ఆనందదాయకం

### వృద్ధులు, దివాంగులకు చీరలు, స్కూల్ కిట్స్ పంపిణీ .. ఘనంగా మళ్ల అనూష జన్మదిన వేడుకలు



విశాఖ సిటీః ప్రతీ సంవత్సరం తల్లిదండ్రుల ఆశీస్సులతో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం భగవంతుడిచ్చిన వరమని, ఇది తనకెంతో ఆనందదాయకమైన విషయమని అన్నారు. నగరంలోని ఆశీల్‌మెట్ట దగ్గర వెల్ఫేర్ గ్రూప్ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఘనంగా తన పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకున్నారు మళ్ళ అనూష. కుటుంబ సభ్యులు, వెల్ఫేర్ సిబ్బంది తదితరులు హాజరయ్యారు. ఈ వేడుకలలో మళ్ళ అనూష తల్లి అరుణ కుమారి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఆమె సమక్షంలో మళ్ల అనూష బర్త్‌డే కేక్‌ను కట్ చేశారు. తొలుత ఆమె తల్లితండ్రులైన మళ్ళ విజయప్రసాద్, అరుణకుమారి ఆశీస్సులు గైకొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం తన పుట్టినరోజున సామాజిక కార్యక్రమాలలో భాగం పంచుకోవడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా వెల్ఫేర్ ఛారిటబుల్ ట్రస్టు లాభాల్లో కొంత భాగాన్ని ఖర్చు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. పేద, బడుగు వర్గాలకు, వృద్ధ మహిళలు, వికలాంగులు, నిరుపేద స్కూలు పిల్లలకు తన వంతు సహాయాన్ని అందిస్తున్నట్లు ప్రకటించారు. మానవ సేవే మాధవ సేవ అని ఇతరులకు సహాయం చేయడంలోనే తనకెంతో సంతోషముందని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ పీలా హరిప్రసాద్, వెల్ఫేర్ సంస్థ కెహెచ్ఆక్ మేనేజర్ మురళి కృష్ణ, పిఆర్ఓ సూర్యప్రసాద్, సభ్యులు అజయ్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్.పి.ఎమ్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కళ్ళజోళ్లు పంపిణీ



విశాఖపట్నంః రాష్ట్ర శాసన మండలి సభ్యుడు డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్. మూర్తి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఎమ్.పి.ఎమ్. ట్రస్టు ఇటీవల ఎన్‌టిఆర్ సేవా సమితి ట్రస్టుతో కలసి నిర్వహించిన ఉచిత వైద్య శిభిరాలలో నేత్ర పరీక్షలు చేయించుకున్నవారికి ఉచిత కళ్ళజోళ్ల వితరణ కార్యక్రమాన్ని బుదవారం నిర్వహించారు. స్థానిక జ్ఞానాపురం దగ్గర 44వ వార్డు సామాజిక భవనంలో జరిగిన ఈ కార్యక్రమానికి ట్రస్టు సభ్యులు హజరయ్యారు.ఈ సందర్బంగా ఈ వైద్య శిబిరాల ద్వారా ప్రజలందరికి ఉచితంగా వైద్యం అందించడంతో పాటు అవసరమైన వారందరి ఉచితంగా కళ్ళజోళ్లు అందించడం పట్ల ప్రజలు చాలా అనందంగా ఉందన్నారు.ఆర్థిక సమస్యలతో వైద్యం అందక, వైద్యం చేయించుకొనే పరిస్థితి లేక కంటి చూపు ఆనక ఇబ్బందులు పడుతున్న వారి జీవితం లో వెలుగులు నింపడం డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్.మూర్తి లక్ష్యం అన్నారు.గీతం ఆస్పత్రి, ధంత వైద్య కళశాల, ఆస్పత్రి వైద్య బృందాల సహకారంతో ఎమ్‌పిఎమ్ ట్రస్టు ఇప్పటి వరకు విజయవంతంగా 1000మందికి ఉచితంగా కళ్ళజోళ్లు అందజేశామన్నారు .కార్యక్రమంలో స్థానిక నాయకలు ఈరోతి చిన్నకుమార్ ట్రస్ట్ నిర్వాహకులు ఆళ్ళ శ్రీనివాసు, పి.వి.రామారెడ్డి, అత్తిలి శంకరావు, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రన్న పెళ్లికానుక అందజేత

### టీడీపీ అధ్యక్షుడు గంటా నూకరాజు



భీమునిపట్నంః స్థానిక 16 వవార్డు సాయిబాబా మందిరం లో వివాహం చేసుకుంటున్న వాడ మొదలు ప్రసన్నబాడా రాజు దంపతులకు చంద్రన్న పెళ్ళికానుక 30,000 బాండ్ ను భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షులు గంటానూకరాజు ,కార్యదర్శి గొలగాని నరేంద్ర కుమార్ లు బుదవారం అందజేశారు.

ఈ సందర్భంగా గంటానూకరాజు మాట్లాడుతూ చంద్రన్న పెళ్ళికానుక పేదలకు వరం లాంటి దని అన్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ మిత్ర ,టీడీపీ నాయకులు గాడు.సన్యాసినాయుడు , పి.యోగి, కాసరపు.నాగరాజు , మారోజు సంజీవ్ కుమార్, జన్మ భూమి కమిటీ సభ్యులు రాకోతు నర్సింగరావు ,రాంబాబు,రమేష్, ఊళ్ళ దుర్గారావు, కొక్కిరి అప్పన్న, షేక్ అన్వర్, జి.పోలిరాజు తదితరులు పాల్గొన్నారు

# మహిళల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం



అనకాపల్లి : . మహిళల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని అనకాపల్లి శాసన సభ్యులు పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. స్ధానిక నూకాంబిక అమ్మవారి ఆలయంలో సాదికార మిత్రలతో ముఖాముఖి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రానించేందుకు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని, కార్యక్రమాలు మహిళల కోసం ప్రవేశపెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు చేపడుతున్నారన్నారు. ప్రభుత్వం చేపట్టే ప్రతీ పదకాన్ని సాదికార మిత్ర సభ్యులు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అలాగే ప్రముఖ వైద్య నిపుణురాలు కాంద్రేగుల సత్యవతి, ప్రసం గించారు. పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ కెకెవిఎ నారాయణరావు అధ్యక్షతనలో ఈ కార్యక్రమంలో జరిగింది.

ఈ సమావేశంలో మళ్ల సురేంద్ర, బుద్ద నాగజగదీష్, కొణతాల వెంకటరావు, కొణతాల రత్నకుమారి, పొలిమేర నాయుడు, తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో నియోజకవర్గం నలు మూలల నుండి మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అనాథ బాలలకు బ్యాగులు పంపిణీ



భీమునిపట్నంః సేవే పరమావధిగా చేయ నున్నట్లు సంత్ నిరంకారి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు మిరిపురి ప్రేమ్‌బి అన్నారు. బుధవారం స్థానిక కృష్ణా కోలని లో ఉన్న నవజీవన్ ఆశ్రమం లో ఉన్న అనాథ బాల లకు 40బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉండే వారిని ఆదు కోవాలనే ఈ విధంగా చేయనున్నట్లు తెలిపారు. అనాధ బాలలు మనం ఎల్లవేళలా ఆదు కోవా లని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎ.పి సేవాదళ్ కమేండర్ రవి, పి.విరావు, సత్యనారాయణరాజు,గద్దె పిల్లి రాము,సురేంద్ర, కవిత, గణేష్ ఆశ్రమం నిర్వా హకులు స్వాతి, వార్డెన్ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

# భారత దేశ ప్రజలపై ఇందిర కక్షకు ప్రత్యక్ష నిదర్శనం ఎమర్జెన్సీ

### విశాఖ ఎంపీ హరిబాబు

విశాఖపట్నం : భారత దేశ చరిత్ర లో అత్యంత దుర్దినం, భారత దేశ ప్రజలపై కక్ష కట్టిన కాంగ్రెస్ పాలనకు ప్రత్యక్ష నిదర్శనం ఎమర్జెన్సీ. జూన్ 25, 1975 అర్ధరాత్రి నుంచి భారత దేశ చరిత్రను చీకటిలోకి నెట్టిన అత్యంత కిరాతక పాలకురాలు ఇందిర అని భారతీయ జనతా పార్టీ ఘోషించింది. నాటి దుర్దిన రోజులను గుర్తు చేసుకుంటూ విశాఖనగరంలో బీజేపీ నిర్వహించిన సమావేశంలో విశాఖ ఎంపీ డాక్టర్ హరిబాబు, సత్యరావు మాస్టర్ ఎమర్జెన్సీ కాలంలో దేశ ప్రజలు ఎదుర్కొన్న ఘటనలను వివరించారు.

ముఖ్య అతిధిగా హాజరైన విశాఖపట్నం ఎంపీ డాక్టర్ కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ 1971 బాంగ్లాదేశ్ విమోచనతో శక్తి మంతమైన నాయకురాలుగా ఎదిగిన ఇందిరా గాంధీ 1975లో ఎమర్జెన్సీ విదించటానికి దారి తీసిన పరిస్థితులను వివరించారు. లోకనాయక్ జయప్రకాశ్ నారాయణ్ సంపూర్ణ క్రాంతి ఉద్యమం, ఇందిరా గాంధీ ఎన్నిక రద్దు, విద్యార్థుల ఉద్యమం, జయప్రకాశ్ నారాయణ విజయవాడ పర్యటన, అత్యవసర పరిస్థితి విధింపు తదితర విషయాలు వివరించారు.

అలాగే ఎమర్జెన్సీ కాలంలో కొన్ని వ్యవస్థలు సక్రమంగా నడిచినట్లు జరిగిన ప్రచారాన్ని, అరెస్ట్ అయి జైలు లో ఉన్నపుడు కల్పించిన వసతులు, ఎమర్జెన్సీ ఎత్తివేయటానికి కారణమైన ఇంటలిజెన్స్ రిపోర్ట్ గూర్చి, జనతా పార్టీ ఆవిర్భావం, ఎన్నికలలో గెలుపు తదితర విషయాలను తెలిపారు. నాటి పరిస్థితులకు బలై, ఎదురొడ్డిన వారిలో జన సంఘ్ నేతలు జయప్రకాశ్ నారాయణ్, మాజీ ప్రధాని అటల్ బిహారి వాజపేయి, లాల్ కిషన్ అద్వానీ, మురళి మనోహర్ జోషి, తదితరులు ఆయా ప్రాంతాల్లో జైలు పాలు కాగా, ప్రస్తుత ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు విశాఖపట్నం జైల్లోనే చాలాకాలం గడిపారని గుర్తు చేశారు. అనంతర కాలంలో చాలా మంది అజ్ఞాత వాసం చేశారన్నారు. ఎమర్జెన్సీ విధించాలి అని ఆమె తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించిన నాటి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయ మూర్తి సిన్హా, అప్పటి ప్రెసిడెంట్ ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ ద్వారా 1975 జూన్ 25 అర్ధరాత్రి 11.45 నిమిషాలకు అధికారికంగా విధింపజేశారన్నారు. ఎన్నికలను నిలిపివేసి, పౌరహక్కులు అడ్డుకునే అధికారాన్ని ప్రధాన మంత్రికి ఈ ఆర్డర్ అందించింది. ఎమర్జెన్సీలో ప్రధానంగా ఇందిరా గాంధీ రాజకీయ ప్రత్యర్థులను జైలుపాలు చేసి, పత్రికలను సెన్సార్ చేశారు.ప్రభుత్వ వ్యతిరేక వార్తలు వ్రాసిన ఎందరో విలేకరులు, సంపాదకులు జైలు కు పంపిన ఘనత ఇందిరాదే నన్నారు. ఆమె కుమారుడు సంజయ్ గాంధీ ముందుండి నడిపిన సామూహిక గర్భనివారణ కార్యక్రమం) వంటి ఇతర దురాగతాలు ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించాయని తెలిపారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యంత వివాదాస్పదమైన కాలాల్లో ఎమర్జెన్సీ ఒకటి అని అన్నారు.

# అప్పన్న పొరుగుసేవల సిబ్బంది చేతివాటం

సింహాచలం : సింహగిరిపై వెంచేసి యున్న శ్రీ వరాహలక్ష్మి నరసింహస్వామి సొంతింటి సిబ్బంది నిర్వాకం తో వకవైపు ఆలయ ప్రతిష్టకు భంగం కలుగుతుంటే మరోవైపు అప్పన్న ఖజానాకు కొందరి పొరుగుసేవల సిబ్బంది నిర్వాకంతో ఖజానాకు భారీగా గండిపడుతోంది అందుకు ఉదాహరణ గడిచిన 10 రోజుల్లో మూడో స్కామ్ బయటపడటం వివరాల్లోకి వెళితే దేవస్థానం పొరుగుసేవల సిబ్బందిలో వక యువకుడు అప్పన్నకి దర్శనం టిక్కెట్లకి సంబంధిన నగదు సుమారు 50 వేలు పైచిలుకు నగదును సొంతానికి వాడుకున్నట్టు సమాచారం విషయం భయటకుపొక్కటంతో విషయం అధికారులకు తెలియటంతో అధికారులు సొమ్మును రికవరీ చేశారని సదరు వ్యక్తిని విధులనుంచి తొలి గించినట్టు సమాచారం ఈ వ్యక్తి గతంలోకూడా ఇదేవిధం గా చేసినట్టు సమాచారం గడిచిన పదిరోజుల్లో భయట సేవలసిబ్బంది మూడో స్కామ్ బయటపడటంతో అదికారులు చూసి చూడనట్టు వ్యవహారం సరైనప్రక్షాళన చర్యలు చేపట్టకపోవడంవలన తరుచూ ఇవి జరుగు తున్నాయని ఇప్పటికెయ్ నా తగు నివారణ చర్యలు చెపట్టి అప్పన్న ప్రతిష్టను ఖజానాను కాపాడాలని సాధారణభక్తులు కోరుకుంటున్నారు.

# విజయభాను సంపాదకీయం

## అభివృద్ధి పథంలో తెలంగాణ

అభివృద్ధిలో తెలంగాణ సగటున 17.2 వృద్ధిరేటు సాధించి దేశంలోనే నెంబర్ వన్‌గా నిలువడం గర్వకారణం. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) గణాంకాలే తెలంగాణ అభివృద్ధి పరుగును చాటిచెబుతున్నాయి. పారిశ్రామికంగా, వ్యవసాయికంగా ఎంతో అభివృద్ధి చెందాయని చెప్పుకుంటున్న మహారాష్ట్ర, హర్యానా లాంటి రాష్ట్రాలకంటే కొత్త రాష్ట్రం తెలంగాణ ముందుండటం గమనార్హం. కాగ్ గణాంకాల ప్రకారం హర్యానా, మహారాష్ట్ర, ఒడిషా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు తెలంగాణ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. దీన్నిబట్టి తెలంగాణ అభివృద్ధి వేగాన్ని అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి స్టేట్ ఓన్ టాక్స్ (ఎస్వోటీ) రాబడిలోనూ దేశంలోని మిగతా 28 రాష్ట్రాలకన్నా ముందున్నది. నాలుగేండ్ల కిందట రాష్ట్రం ఏర్పడినప్పుడు రెవెన్యూ రాబడి 2015-16లో 43,260 కోట్లు మాత్రమే ఉండేది. అదిప్పుడు 65 వేల కోట్లకు చేరి కేంద్రం ఇచ్చే గ్రాంట్ ఇన్ ఏడ్‌తో కలిపి 73 వేల కోట్లకు చేరుకోవటం ఆర్థికాభివృద్ధి క్రమాన్ని చాటుతున్నది. ఇది యాదృచ్ఛికంగా జరిగింది కాదు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ నేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే, వినూత్న అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం వల్ల సాధ్యమైంది. అలాగే ఉద్యమస్ఫూర్తి కలిగిన ప్రజల భాగస్వామ్యం కారణంగానే ఎస్వోటీ రాబడులు గణనీయంగా పెరిగి దేశంలోనే తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచింది. మొత్తంగా చూస్తే అభివృద్ధిలోనూ, రెవెన్యూ రాబడిలోనూ తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలువటం బంగారు తెలంగాణ సాక్షాత్కారం చేసే దిశగా సాగుతున్న గమనానికి నిదర్శనం. ఇప్పటివరకు అభివృద్ధి గురించి ప్రభుత్వాలు చెప్పిన గణాంకాలకు, ప్రజల జీవనస్థితిగతులకు పొంతన ఉండేది కాదు. దీంతో అభివృద్ధి లెక్కలు అంటేనే అంకెల గారడీ అనే అభిప్రాయం ఏర్పడ్డది. ప్రభుత్వాలు రెండంకెల అభివృద్ధి గురించి గొప్పలు చెబుతున్న సమయంలోనే ప్రజలకు ఆకలి, దప్పులు తీరని దుస్థితి. అభివృద్ధి సంక్షేమ పథకాలన్నీ ఓటు బ్యాంకు రాజకీయ ఎరలుగా ఉండేవి. కానీ తెలంగాణ రాష్ట్రాభివృద్ధి క్రమం ఇందుకు భిన్నంగా ముందుకు సాగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమ ఆకాంక్షలు తీర్చడానికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతున్నది. ప్రజల జీవన ప్రమాణాలను సమూలంగా మార్చివేసి మెరుగైన ఆర్థిక జీవనానికి పునాది వేసే పథకాలకు రూపకల్పన చేసి అమలు చేస్తున్నది. పల్లె సీమలను ధాన్యాగారంగా మారుస్తున్న మిషన్ కాకతీయ మొదలు, వృత్తి జీవితాల్లో వెలుగులు నింపే గొర్రె లు, చేపల పెంపకం లాంటి పథకాలను ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. పరాయి పాలనలో కరు వు కాటకాలకు నెలవుగా మారిన తెలంగాణ ఇప్పుడు శరవేగంగా సాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో పచ్చగా మారుతున్నది. ఇప్పటికే మిష న్ కాకతీయతో, ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలతో లక్షలాది ఎకరాలకు నీరందుతున్నది. సమస్త కులవృత్తులు ఆధునిక సాంకేతిక అభివృద్ధిని సొం తం చేసుకొని పూర్వ వైభవం పొందటమే కాదు, వృత్తి జీవితాలన్నీ స్వయం సమృద్ధిని సాధిస్తున్నా యి. నిండిన చెరువులు సమస్త కులాలకు జీవనోపాధిని కల్పిస్తున్నాయి. పల్లె ప్రగతి, ప్రజల అభ్యున్నతి అనేది కాగితాలమీది రాతలతో, నోటి వాగ్దానాలతో ఆవిష్కరించబడేది కాదు. ఎక్కడైతే భూమి పాలన వ్యవహారాలను స్పష్టతతో అవగాహన చేసుకొని, దానికి అనుగుణంగా కార్యాచరణ ఎన్నుకున్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. భూమి పాలన వ్యవహారాలను శాస్త్రీయంగా అర్థం చేసుకున్న జపాన్, హాంకాంగ్, దక్షిణ కొరియా, చైనా లాంటి దేశాలు అభివృద్ధిలో దూసుకుపోయాయి. సరిగ్గా ఇదే తరహాలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే దిశగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నది. తెలంగాణ భూ తత్వాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకొని దానికి అనుగుణమైన పంటల సాగును ప్రోత్సహిస్తున్నది. ఆహారపదార్థాలు, కూరగాయల సాగును పెంచి ఆహార భద్రతను పరిరక్షిస్తూ నే, ఎగుమతులతో రాబడిని పెంచుకునే పంటలను సాగుచేసే దిశగా రైతులను చైతన్యం చేస్తున్న ది. వ్యవసాయ అనుబంధ పంటలను, పరిశ్రమలను పెంచి ఒకప్పుడు దండుగన్న వ్యవసాయాన్ని పండుగలా మారుస్తున్నది. వ్యవసాయ సంబంధిత మౌలిక అవసరాలన్నింటినీ తీర్చి రైతులకు అండగా నిలుస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విధమైన సమగ్ర కార్యాచరణ, దీర్ఘకాలిక అభివృద్ధి వ్యూహం కారణంగానే రెండంకెల అభివృద్ధితో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా నిలిచింది. రాబోయే కాలంలో సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తయి కోటి ఎకరాలకు సాగునీరు అందబోతున్న తరుణంలో మరెవరూ సాధించలేని, అందుకోలేని అభివృద్ధి రేటును తెలంగాణ సాధిస్తుందనటంలో సందేహం లేదు.

## క్రికెట్ ఫ్యాన్స్‌పై ఐసీసీ సర్వే .. ఆశ్చర్యకర ఫలితాలు

దుబాయ్: భారతదేశంలో క్రికెట్ ఉన్నంత ప్రజాదరణ మరే క్రీడకు లేదు అనడం అతిశయోక్తి కాదు. ముఖ్యమైన క్రికెట్ ఉందంటే మనోళ్లు పనుల్లన్నీ మానుకొని మరీ ఆ మ్యాచ్ చూస్తారు. తమ అభిమాన క్రికెటర్ ఆడుతుంటే.. టీవీలకు అతుక్కుపోతారు. ఆడా, మగా, వయస్సుతో సంబంధం లేకుండా ప్రతీ ఒక్కరు క్రికెట్ చూస్తారు. అయితే క్రికెట్ అభిమానులకు సంబంధించి అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఐసీసీ ఓ సర్వే చేసింది. ఇందులో పలు ఆశ్చర్యకరమైన విషయాలు బయటకు వచ్చాయి. ఇందులో ప్రపంచవ్యాప్తంగా దాదాపు వంద కోట్ల మందికి పైగా(ఒక బిలియన్) క్రికెట్ అంటే అభిమానిస్తున్నారని వెల్లడైంది. ఇందులో 39శాతం మంది మహిళలు, అమ్మాయిలు ఉన్నారు. అంతేకాక సగటుగా ఒక అభిమాని వయస్సు 34 ఉండొచ్చని తేలింది. దీంతో పాటు నూటికి 64శాతం మంది టెస్ట్, వన్డే, టీ20 క్రికెట్‌ని ఇష్టపడుతున్నారని, అందులో నూటికి 69 శాతం మంది టెస్ట్ క్రికెట్‌ని, 88శాతం వన్డేలను, అత్యధికంగా 92 శాతం మంది టీ-20లను ఇష్టపడుతున్నారు. ప్రతీ ముగ్గురు అభిమానుల్లో 2 మహిళ క్రికెట్‌ను చూసేందుకు కూడా ఆసక్తి చూపుతున్నారు. దీంతో పాటు 70 శాతం మంది మహిళల క్రికెట్ మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేయాలని డిమాండ్ చేశారు. ఐసీసీ నిర్వహించే ట్రోర్నీలను చూసేందుకు 95 శాతం మంది ఆసక్తి చూపించగా.. అందులో వన్డే, టీ-20 ప్రపంచకప్‌లదే అగ్రస్థానం. దీంతో పాటు 87 శాతం మంది టీ-20లను ఒలింపిక్స్‌లో చేర్చాలని కోరడం కొసమెరుపు.

## వాద్రా పన్నుల ఎగవేతపై రాహుల్‌ను ప్రశ్నించిన బీజేపీ

న్యూఢిల్లీ: ఆదాయం పన్ను ఎగవేసినట్టు రాబర్ట్ వాద్రాపై వచ్చిన ఆరోపణలపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పందించాలని బీజేపీ డిమాండ్ చేసింది. 2010-2011 సంవత్సరానికి ఎరియర్స్ చెల్లించాలని ఆదాయం పన్ను శాఖ వాద్రాను ఆదేశించిందని, దీనిపై రాహుల్ సమాధానం తాము కోరుతున్నామని బీజేపీ ప్రతినిధఇ సంబిత్ పాత్ర బుధవారంనాడు మీడియాతో మాట్లాడుతూ అన్నారు.

రాబర్డ్ వాద్రాతో సంబంధం ఉన్న ఢిల్లీకి చెందిన స్కై లైట్ హాస్పిటాలిటీ ఎల్ఎల్‌పీ కంపెనీ 2010-11 సంవత్సరానికి రూ.25 కోట్ల పన్ను బకాయిలు చెల్లించాలంటూ ఐటీ నోటీసులు ఇచ్చినట్టు సమాచారం. ఐటీ ఉత్తర్వు ప్రకారం, స్కై లైట్ హాస్టిలాలిటీ 2010-11 వార్షిక ఆదాయాన్ని రూ.36.9 లక్షలుగా అంతకుముందు ప్రకటించింది.

అయితే ఐటీ శాఖ ఆ ఆదాయాన్ని తిరిగి లెక్కగట్టి ఆ మొత్తం రూ.42.98 కోట్లుగా నిర్ధారించిందని, అందులో 0.86 శాతాన్ని మాత్రమే ఆదాయంగా చూపించినట్టు గుర్తించిందని సమాచారం.
సవరించిన ఆదాయం లెక్కింపు ప్రకారం రూ.25.8 కోట్ల పన్ను బకాయిలు చెల్లించాలని ఐటీ తాజాగా ఆదేశాలిచ్చిందని తెలుస్తోంది.

## కర్ణాటకలో మళ్లీ రాజకీయ కల్లోలం



బెంగళూరు : రాజకీయాలు ఎప్పుడు ఎలా మారుతాయో ఎవ్వరూ ఊహించలేరు. ఈ విషయం కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు కూడా తెలుసు. ఈ ఏడాది సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను తిరిగి అధికారంలోకి తీసుకురాలేకపోయిన ఆయనకు బద్ధశత్రువులతో కలసి పని చేయాల్సిన పరిస్థితి దాపురించింది. ముఖ్యమంత్రిగా హెచ్‌డీ కుమారస్వామి కంటే యడ్యూరప్ప అయితేనే సిద్ధరామయ్య ఇష్టపడేవారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

అయితే, కాంగ్రెస్ అధిష్టానం మాత్రం జేడీఎస్‌తో కూటమిని కొనసాగించాలని ఆయన్ను ఒత్తిడి చేస్తోంది. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వాస్తవాలను తెలుసుకుని మసులుకోవాలని సిద్ధరామయ్యకు హితబోధ చేస్తోంది. కర్ణాటక రాష్ట్రంలో దేవెగౌడ కుటుంబం పాలన చేయడం సిద్ధరామయ్యకు సహించడం లేదు. కాంగ్రెస్, జేడీఎస్ వెనుక పాలనలో నడవడం మరీ రుచించడం లేదు.

కేబినేట్ విస్తరణ పూర్తై మూడు వారాలు గడిచాయో.. లేదో..! అప్పుడు సోదర జేడీఎస్ పార్టీపై, ముఖ్యమంత్రి కుమారస్వామిపై రోజుకో వ్యంగ్యాస్త్రాన్ని వదులుతున్నా రాయన. సిద్ధా వైఖరి పట్ల మిత్రపక్షం జేడీఎస్‌లోనే కాక, సొంతపార్టీ నేతల్లో కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది. కర్ణాటకలో కాంగ్రెస్‌ను భుజాలపై ఎత్తుకుని నడిపించిన మాజీ సీఎం సిద్ధరామయ్య ఇప్పుడు అదే పార్టీకి తలనొప్పిగా మారడం హాట్ టాపిక్‌గా మారింది.

తాజాగా ఈ ప్రభుత్వం ఇంకెంతకాలం నిలబడుతుందంటూ సిద్ధరామయ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి కుమారస్వామి పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టడంపై కూడా సిద్ధూ అభ్యతరం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కుమారస్వామితో కాంగ్రెస్ చీఫ్ రాహుల్‌గాంధీకి ఎలాంటి సమస్యా లేదని సిద్ధరామయ్య గుర్తించాలని ఆ పార్టీకి చెందిన మరో సీనియర్ నేత పేర్కొన్నారు. తాజాగా బయటికి వస్తున్న వీడియోలన్నీ సిద్ధరామయ్య చికిత్స పొందుతున్న దక్షిణ కన్నడ జిల్లాలోని బెల్తాంగడి ప్రకృతి వైద్య కేంద్రం నుంచే వస్తున్నాయని కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేల్లోని ఓ వర్గం భావిస్తోంది. గందరగోళ వాతావరణం సృష్టించేందుకే మాజీ సీఎం వీటిని విడుదల చేస్తున్నారని సదరు ఎమ్మెల్యేలు ఆరోపిస్తున్నారు.

## ఆ సర్వేను తోసిపుచ్చిన మోదీ సర్కార్..

న్యూఢిల్లీ : మహిళల భద్రతలో భారత్ అత్యంత ప్రమాదకర దేశాల్లో ఒకటని రాయ్‌టర్స్ సర్వే వెల్లడించడాన్ని ప్రభుత్వం తోసిపుచ్చింది. సర్వేలో వెల్లడించిన అంశాలు కేవలం ఒపీనియన్ పోల్ ఆధారంగా చెప్పినవేనని, ఎలాంటి గణాంకాలు, నివేదిక ఆధారంగా వెల్లడించినవి కాదని మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆక్షేపించింది.

కేవలం 548 మందిని ఆరు ప్రశ్నలు అడగటం ద్వారా ర్యాంకింగ్‌లు ఇచ్చారని, మంత్రిత్వ శాఖ నుంచి ఎలాంటి సమాచారం, అభిప్రాయం కోరలేదని పేర్కొంది.

జాతీయ మహిళా కమిసన్ (ఎన్‌సీడబ్ల్యూ) సైతం ఈ సర్వేను తోసిపుచ్చింది. 130 కోట్ల మంది ప్రజలున్న దేశంలో కేవలం కొద్దిమంది అభిప్రాయాలు తీసుకోవడం ద్వారా వాస్తవ పరిస్థితి ప్రతిబింబించదని పేర్కొంది. మహిళా హక్కుల విషయంలో చాలా దేశాల కంటే భారత్ మెరుగైన స్థానంలో ఉందని స్పష్టం చేసింది.

మరోవైపు మహిళల భద్రతపై రాయ్‌టర్స్ నివేదికను కాంగ్రెస్ సహా విపక్షాలు ప్రస్తావిస్తూ మోదీ సర్కార్‌పై నిప్పులు చెరిగారు. మోదీ ఖరీదైన మైదానాల్లో యోగాసనాలు వేస్తుంటే దేశ మహిళల భద్రత ఆందోళనకరంగా మారిందన్న సర్వేలు సిగ్గుచేటని కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ ఆరోపించారు.

## కవి సమయం

### మనిషి ప్రవర్తన

మంచి మనస్సు ఆలోచనా ధోరణి
సమాజ శ్రేయస్సు, పరుల హితం
పరోపకారం, క్షమాగుణం
సహనం, సర్వజీవ సమానత్వం
సాత్విక ప్రవర్తన, మితభాషణం
సజ్జన సాంగత్యం, ప్రేమతత్వం
సత్పురుషుల ఆలోచనా తత్వం
మనందరికీ స్ఫూర్తిదాయకం
కోరికలను నియంత్రించుకోవడం
అరిషడ్వర్గాలను లోబరుచుకోవడం
మానవసేవే ప్రధాన కర్తవ్యంగా
ముందుకు సాగడం అవశ్యం

...కవితా రచన
సి.ప్రతాప్
సెల్ నెం: 90636 22665

## పంచాంగం

మాసం : నిజ జ్యేష్ట ; తిథి : పూర్ణిమ ఉ.9.12; మూల 11.56; ఉ.వ.10.10ల 11.56; రా.వ.10.30ల 12.16.

గురువారం 28-06-2018

**మేషం** : ఆత్మీయుల కోసం ధనం విరివిగా వ్యయం చేయవలసి వస్తుంది. బంధువులను కలుసుకుంటారు. స్త్రీలకు షాపింగ్‌లోనూ, వాహనం నడుపు తున్నపుడు ఏకాగ్రత ముఖ్యం.నూతన పరిచయాలు, వాతావరణం సంతృప్తి నిస్తాయి.

**వృషభం** : బ్యాంకుల్లో మీ పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కో వలసి వస్తుంది. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్లు కలిసివస్తాయి. ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాలు, ఒప్పందాల్లో మెలకువ వహించండి.

**మిధునం** :స్త్రీలకు, గృహ వాతావరణం, సంతానం వైఖరి వల్ల చికాకులు తప్పవు. కళాకారులకు, క్రీడాకారులకు మంచి గుర్తింపు రాణింపు లభిస్తుంది. పలుకుబడి కలిగిన వ్యక్తుల పరిచయం వల్ల పనులు అనుకూలిస్తాయి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణం మంచిది కాదు.

**కర్కాటకం** :విదేశీ వస్తువుల పట్ల ఆకర్షితులవుతారు. ప్రముఖులను కలుసు కుంటారు. బంధువుల రాకతో గృహంలో సందడి నెలకొంటుంది. మీ సంతానం ఉన్నతి కోసం కొత్తకొత్త పథకాలు రూపొందిస్తారు. స్త్రీలలో ఒత్తిడి, హడావుడి అధికమవుతాయి.మీ స్థోమ తకు మించిన వాగ్ధానాల వల్ల ఇబ్బందుల ఎదుర్కొం టారు.

**సింహం** :పోస్టల్, కొరియర్ రంగాల వారికి ఒత్తిడి, పనిభారం అధికమ వుతుంది. నిరుద్యోగులకు సదావకాశాలు లభించిన సద్వినియోగం చేసు కోలేరు. ఉపాధ్యాయులకు పై అధికారుల నుంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. మీ కళత్ర మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది.

**కన్య** : కొంతమంది మీతో సన్నిహితంగా ఉంటూనే చాటుగా అపకారం తలపెట్టేందుకు యత్నిస్తారు. చిన్ననాటి మిత్రులను, ప్రియమైన వ్యక్తులను కలుసుకుంటారు. స్థిరాస్తిని కొనుగోలుచేయు యత్నాలు ఫలిస్తాయి. పనులు మొదట్లో మందగించినా క్రమేపీ పూర్తికాగలవు. కుటుంబీకులతో దైవ దర్శనాలు చేసుకోగలగుతారు.

**తుల** : కాంట్రాక్టర్లకు కార్మికులతో సఖ్యత నెలకొంటుంది. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు. భాగస్వామి మాటతీరు, కదలికలను గమనించడం ఎంతైనా మంచిది.

**వృశ్చికం** : ఆర్థిక లావాదేవీలు, ఒప్పందాల్లో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. వృత్తిపరంగా ఎదుర్కొంటున్న ఆటంకాలు క్రమంగా తొలగి పోగలవు. ఒక్కోసారి మీ జీవిత భాగస్వామి మనస్తత్వం అర్థం చేసుకోవడం కష్ట మవు తుంది. సభలు, సమావేశాలల్లో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు.

**ధనుస్సు** : ఫ్యాన్సీ, స్టేషనరీ, రసాయన, సుగంధ ద్రవ్య వ్యాపారులకు శు భదాయకం. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి. ఆకస్మిక ఫీజులు, బిల్లులు చెల్లిస్తారు. పట్టుదలతో శ్రమించి అనుకున్నది సాధిస్తారు. సోదరీ, సోదరులతో ఉల్లాసంగా గడుపుతారు. కుటుంబీకుల ఆరోగ్యంలో మెళకువ అవసరం.


**మకరం** : ఆర్థిక కార్యకలాపాలు సానుకూలంగా సాగుతాయి. మీ సంతానం మొండివైఖరి వల్ల చికాకులు వంటివి ఎదుర్కొంటారు. ఫైనాన్స్ వ్యాపారస్తులకు ఖాతాదారుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది. నిరుద్యోగులకు తాత్కాలిక అవకాశం లభిస్తుంది. పెద్దలతో కుటుంబ విషయాలు చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటారు.

**కుంభం** :కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటిపైనే శ్రద్ధ వహించండి. నిరుద్యోగులకు రాత, మౌఖిక పరీక్షల్లో ఏకాగ్రత ముఖ్యం. కుటుంబ విషయాల్లో స్త్రీలకు పట్టుదల, పంతాలు మంచిది కాదు. ఉద్యోగ స్తులకు హోదాతో పాటు బరువు బాధ్యతలు పెరుగుతాయి. ఉపాధ్యాయులకు పనిభారం అధిక మవుతుంది.

**మీనం** : గృహంలో మార్పులు, చేర్పులు అనుకూలమైన కాలం. బ్యాంకు డిపాజిట్లు, దీర్ఘ కాలిక పెట్టుబడులకు అనుకూలం. పుణ్యక్షేత్రాల దర్శనం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుంది.

# సాయిబాబా చిన్న కథలు

సంకీర్తన



### పునరపి జననం

బలిచక్రవర్తి యొక్క కుమార్తె రత్నమాల బలిచక్రవర్తిని దానము అడిగే నిమిత్తము వచ్చిన వామనమూర్తిని చూచింది. దివ్యతేజస్సుతో, ముద్దులొలుకు మోముగల ఆ వటువును చూసి "ఆహా! ఎవరీ సుందరమూర్తి! మహ తేజోవంతుడుగా ఉంటున్నాడు. సమస్త కళలు ఇతని యందు మూర్తీభవించి యున్నవి. షోడశకళలతో వెలిగిపోతున్న ఈ బాలుడే నాకు పుత్రుడుగా జన్మించి వుంటే ఎంత బాగుండేది. అంతటి అదృష్టము కలుగుట సాధ్యమా! ఆ బాలునికి ప్రేమతో పాలిచ్చి లాలించి పాలించే భాగ్యము వుండేది కదా!" అని అనేక విధములుగా భావన చేసింది. అట్లు ఊహాలోకంలో పారవశ్యముతో మునిగి వున్నప్పుడు
ఆమె వామనుడు తన తండ్రికి ఏమి అడిగినాడో, తన తండ్రి ఏమి యిస్తున్నాడో, అసలు అక్కడ ఏమి జరుగుతుందో గుర్తించలేదు.


కొంత సేపటికి ఆమె కన్నులు తెరచి చూచేటప్పటికి తాను చూచిన దృశ్యము సహించలేకపోయింది. తన తండ్రి తలపై వామనుడు పాదము పెట్టి అణగద్రొక్కడం జరిగింది. రత్న మాలకు పట్టరానంత కోపము వచ్చింది. చిందులు త్రొక్కుతూ "నా తండ్రి శిరస్సుపై ఒక బీద బ్రాహ్మణుడు కాలు పెట్టి పాతాళమునకు అణగద్రొక్కుటయా!" అని ఆవేశముతో లేచింది. ఆమెలోని రాక్షసత్వం పైకి ఉబికింది. వామనుని చంపాలని ప్రయత్నించింది. బలిచక్రవర్తి సమయస్ఫూర్తితో ఆమెను సమాధానపరిచాడు.

ఒక నిముషంలో ప్రేమ, మరొక నిముషంలో ద్వేషం ఈ రెండు పరస్పర వైరుధ్య ఉద్వేగాలకు గురి అయింది ఆమె. వామనునికి పాలివ్వాలని ఒక కోరిక. అతనిని సంహరించాలని మరొక కోరిక కలిగినది. ఆ కోరికలను తీర్చుకునేందులకు, ద్వాపర యుగంలో పూతన అనే రాక్షసిగా జన్మించి, బాలకృష్ణునికి పాలిచ్చింది. శ్రీ కృష్ణుని చేతిలో మరణించింది.
పూతన శ్రీ కృష్ణుని చంపాలన్న సంకల్పంతోనే వచ్చింది. అయితే లీలా మానుష అవతారమూర్తి అయిన శ్రీ కృష్ణుడు ఆమె యుక్తిని పసి గట్టి ఆమెను, ఆమె కోరిక తీరిన తరువాత హతమార్చాడు.

### మే.. మే.. మే..

శ్రీ రామచంద్రుడు రావణ వధానంతరం పట్టాభిషిక్తుడై రాజ్యపాలన చేస్తున్నాడు. కైక మహారాణి రాముని వద్దకు వెళ్లి, "నాయనా! నావలననే గదా నీకు అనేక కష్టములు కలిగినవి.
అభిమాన, మమకారములచే నిన్ను బాధపెట్టాను. ఈ పాప పరిహారమునకు ఏదైనా ఒక మార్గమును ఉపదేశించు" అని అడిగింది.

...సశేషం



రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

వచ్చే నెల 1వ తేదిన జరుగు

# శ్రీశ్రీశ్రీ కొత్త మహాలక్ష్మి అమ్మవారి పండగ గోడ పత్రిక ఆవిష్కరణ

మాధవధార : మాధవధార గ్రామ ప్రజల అరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ కొత్త మహలక్ష్మి(కడవల) అమ్మవారి పండగ వచ్చే నెల 1వ తేదిన అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు కొత్త మహలక్ష్మి అమ్మవారి ఆలయ ధర్మకర్త సనపల బంగారురాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అవరణలో గోడ పత్రికలను అవిష్కారించారు. ఈ పండగను శ్రీ మాధవ యువజన సమాజం అద్వర్యంలో ఆలయ ధర్మకర్త సనపల బంగారురాజు అర్థిక సహయంతో నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పురాతనం నుండి మాధవధార పోలిమేరలో మర్రి,రావిచెట్టు తోర్రలో అవిర్భావించి, అప్పటి నుండి గ్రామస్తుల ఇలవేల్పుగా మారిందని అప్పటి నుండి గ్రామంలో ఎటువంటి కీడు కలుగకుండా కాపాడుతూ గ్రామ ప్రజలను అమ్మవారు సుఖ సంతోషాలతో కాపాడుతుంది. 2007 యేడాదిలో సనపల బంగారురాజు సొంత నిధులతో అమ్మవారి ఆలయం నిర్మించారు. అప్పటి నుండి అమ్మవారికి నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదేవిదంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఎర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా అమ్మవారిని దర్శించుకోనే భక్తులకు అమ్మవారి పసుపు, కుంకుమ, గాజులు, జాకెట్‌తో పాటు ప్రసాదం సనపల బంగారురాజు చేతూల మీదగా పంపిణి చేయ్యనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాధవధార గ్రామ ప్రజలు సనపల పాండురంగారావు, మూల రాము, శ్రీ మాధవ యువజన సమాజం కార్యదర్శి సనపల అప్పలస్వామి(బోజ్జన్న) సహయ కార్యదర్శి నంబాళ్ళ సురేష్, సనపల రత్నకుమారి, పప్పల రామరాజ్యం, సనపల అనీల్ తదితరులు పాల్గొన్నారు.



గోడ పత్రికను అవిష్కరిస్తున్న సనపల బంగారు రాజు

## దివ్యాంగుల సమాఖ్య సభ్యులకు కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ కార్యక్రమం

యానాం : ఉమ ఎడ్యుకేషనల్ & టెక్నికల్ సొసైటీ యానాం వారి ఆధ్వర్యంలో యానాం కోకోనెట్ కల్యాణమండపం నందు యానాం దివ్యాంగుల సమాఖ్య సభ్యులకు కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా యం.వి.ఎస్.ప్రసాద్ (డి.డి.హెల్త్, యానాం) గౌరి సరోజని (మున్సిపల్ కమిషనర్, యానాం), ఉమ ఎడ్యుకేషనల్ & టెక్నికల్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ ఎస్‌పి.రెడ్డి, జెజెబి మెంబర్ నున్న రామకృష్ణరావు, ఎన్.వి. కృష్ణారావు పాల్గొన్నారు. ముందుగా హెలెన్ కిల్లర్ పుట్టినరోజు సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించి ఆమె గురించి ఆమె సేవలు గురించి వచ్చిన అతిథులు మాట్లాడారు. అనంతరం ఇంటర్నేషనల్ రిసోర్స్ పర్సన్, స్పీకర్ రామకృష్ణరావుచే దివ్యాంగులకు నాయకత్వ లక్షణాలు మీద, సంఘాలను ఏ విధంగా నడిపించుకోవాలి, ప్రభుత్వ పథకాలు ఏ విధంగా పొందాలి అనే అంశాలు మీద దివ్యాంగుల సభ్యులకు ట్రైనింగ్ ప్రోగ్రాం ద్వారా వారికి వివరించారు. దివ్యాంగులకు ప్రభుత్వం అనేక పథకాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. అయితే వాటిని నిజమైన దివ్యాంగులకు చేరకుండా ఉన్నాయి. కావున ప్రతి వికలాంగుడు వారికున్న చట్టాలు, పథకాలు గురించి తెలుసుకోవాలి. అప్పుడే వాటిని పొందుకోవడం జరుగుతుందన్నారు.

## ఎమ్మెల్యే హామీతో దీక్ష విరమించిన అంగన్వాడీలు



నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరి

కొయ్యూరు : 14 నెలలుగా తమకు చెల్లించాల్సిన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కొయ్యూరు సిడిపిఒ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేస్తున్న అంగన్వాడీలు ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి హామీతో దీక్షను విరమించారు. బుధవారం వచ్చిన ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అంగన్వాడీలతో మాట్లాడారు. 14 నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఎలా బతకాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎమ్మెల్యే సిడిపిఒ గౌతమిని సమస్య అడిగి తెలుసుకొని ఆమె పై మండిపడ్డారు. అనంతరం పిడికి ఫోన్‌లో వివరణ కోరగా 10 రోజుల్లో జీతాలు వచ్చేలా చేస్తామని తెలిపారని, దీక్ష విరమించాలని ఎమ్మెల్యే హామీ కోరడంతో అంగన్వాడీలు దీక్ష విరమించారు. ఎమ్మెల్యే స్వయంగా నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.

## ఏజెన్సీలో 17 డెంగ్యూ కేసుల నిర్ధారణతో అప్రమత్తమైన కలెక్టర్

**జిల్లాస్థాయి వైద్య, ఆరోగ్య శాఖ అధికార బృందం ఏజెన్సీకి తరలింపు**
**వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏజెన్సీలోని ఆరోగ్య పరిస్థితులపై సమీక్ష**



విశాఖపట్నం: జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతం నుండి సేకరించిన 27 రక్తనమూనాల్లో 17 డెంగ్యూ కేసులు నిర్ధారణ కావడంతో జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ అప్రమత్తమయ్యారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.రమేష్, జిల్లా మలేరియా అధికారులు మణి, జిల్లా ఆసుపత్రుల కో-ఆర్డినేటర్ డా.నాయక్‌తో పలు వైద్య నిపుణులను ఏజెన్సీకి హుటాహుటిన తరలించి ఏజెన్సీలో ఆరోగ్య పరిస్థితులను చక్కదిద్దాలని ఆదేశించారు. బుధవారం ఐడిడిఏ ఇన్‌ఛార్జి పి.ఓ.బాలాజీ, ఏజెన్సీకి వెళ్లిన జిల్లా వైద్య బృందం, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఏజెన్సీలోని ఆరోగ్య పరిస్థితులపై స మీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ 17డెంగ్యూ కేసులు పాడేరు, అరుకు మండల కేంద్రాల నుండే రిపోర్టు అయ్యాయన్నారు. వారి ఆరోగ్య పరిస్థితి ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుందన్నారు. అన్ని పిహెచ్‌సిల్లో అవసరమైన మందుల నిల్వలను సిద్ధంగా వుంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు జిల్లా వైద్య శాఖాధికారి డా.దేవి, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ఆశా కార్యకర్తలు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం



సబ్బవరం: ఆశా కార్యకర్తలు సమస్యలు పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆశా కార్యకర్తలు, సిఐటియు నాయకుడు ఎం.గౌరీష్ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ కిశోర్‌కుమార్‌కు మెమోరాండం అంద జేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు ఎం.గౌరీష్ మాట్లాడుతూ ఆశావర్కర్స్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేతనాలు గత 12 సంవత్సరాలుగా పారితోషికాల పేరుతో వెట్టి చాకిరి చేయిస్తున్నారని అన్నారు. ఆశాకార్యకర్తల సమస్యలు పరిష్కరించకపోతే జూలై 4వతేదీ నుండి 9వతేదీ వరకు సమ్మె చేస్తామని అన్నారు. ఆశావర్కర్స్‌కు తక్షణమే నెలకు రూ.6,000/-లు వేతనం ఇవ్వాలని, పారితోషక బకాయిలు ఏజెన్సీ ఆశాల గౌరవ వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని, చంద్రన్న సంచార చికిత్స బకాయిలు చెల్లించాలి, పారితోషకం రూ.300లు పెంచాలి. యూనిఫారం అలవెన్స్ వెంటనే చెల్లించాలి. అర్హులైన వారికి ఎఎన్‌ఎం శిక్షణ ఇవ్వాలి. ఇప్పుడు శిక్షణ పొందినవారిని 2ఎఎన్‌ఎంగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో ఆశాకార్యకర్తలు జి.శ్రీకాంత్, డి.భవాని, వి.శాంతికుమారి, పి.రవణమ్మ, బి.కాంతమ్మ, వై.కనకమ్మ, ఎం.మణి తదితరులు పాల్గొన్నారు.

## పియన్‌ఎం జిల్లా అధ్యక్షులుగా అప్పారావు ఎన్నిక

దేవరాపల్లి : ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా అధ్యక్షులుగా దేవరాపల్లి కి చెందిన కాటపల్లి అప్పారావు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 24 న అనకాపల్లిలో పియన్‌ఎం 2వ మహ సభ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది, అధ్యక్షులు గా కాటపల్లి తో పాటు ప్రధాన కార్యదర్శిగా పి.బలదేవ్, ఉపాధ్యక్షులుగా బి.శ్రీనివాసరావు, అంజలి ,వెంకట ప్పారావు, సహాయ కార్యదర్సులు గా కన్నం నాయుడు ,టి .జోషి, రామకృష్ణ లతో పాటు మరో పది మంది సభ్యులను ఎంపికైయ్యా రని అధ్యక్షులు అప్పారావు తెలిపారు. వీరి ఎన్నిక పట్ల ప్రజా సంఘల నాయకులు, ప్రజానాట్యమండలి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో రైతులకు నిరాశ




మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.గంగాభవానీ

నర్సీపట్నం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో రైతులకు నిరాశే మిగిలిందని లేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.గంగాభవానీ ఆరోపించారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2014 ఎన్నికల ప్రచారంలో మానిఫెస్టోలో రైతుకు గిట్టుబాటు ధర కల్పించడానికి డాక్టర్ స్వామినాధన్ కమిటీ సిఫార్సులు అమలు చేస్తామని రైతుల రుణమాఫీ చేసి రైతులను ఆదుకుంటామని, సరైన పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని, వ్యవసాయాన్ని లాభసాటి చేస్తామని, ఆత్మహత్యలు నివారిస్తామని, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని అనేక వాగ్దానాలు చేశారన్నారు. ఇందులో ఏ ఒక్కటి అమలుకు నోచుకోలేదన్నారు. జులై 1, 2, 3, 4 తేదీల్లో విజయ నగరం జిల్లా ఎస్.కోటలో రాష్ట్ర వ్యాప్త శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ తరగతులకు అఖిల భారత కిసాన్‌సభ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య, రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్, వ్యవసాయశాఖ అధి కారులు హాజరవుతారన్నారు.

3వ తేదీన బహిరంగ సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, విప్లవ సినిమాల నిర్మాత, దర్శకులు, నటుడు ఆర్.నారాయణమూర్తి హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శి మేకా సత్య నారాయణ, ఏపి రైతు సంఘం ఉపాధ్య క్షులు జి.గురుబాబు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్, ఎరువుల ధరలను తగ్గించాలని వినతి



ఆర్డీవో విశ్వేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నర్సీపట్నం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెంచిన పెట్రోల్, డీజిల్, ఎరువుల ధరలను నియంత్రించాలని విశాఖజిల్లా సమితి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం నర్సీపట్నం ఆర్డీవో వి.విశ్వేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.గంగాభవానీ మాట్లాడుతూ డాక్టర్ స్వామినాధన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం కేంద్ర ప్రభుత్వం రైతుకి మద్దతు ధర ప్రకటించాలని, రైతులను శాశ్వత విముక్తి చేసేందుకు గాను కేరళ తరహా రుణవిమోచన చట్టం చేయాలని, రైతుల ఆత్మహత్యలను అరికట్టాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉన్నందున రాయితీ ప్రకటన వెంటనే చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని కాపాడి రైతున్ని రక్షించే బాధ్యత ఉన్నప్పటికీ రైతులను చిన్న చూపు చూస్తున్నాయన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరవకపోతే రైతన్న ఆగ్రహాన్ని గురై ప్రభుత్వాలు కూలిపోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శి మేకా సత్యనారాయణ, ఏపి రైతు సంఘం ఉపాధ్యక్షులు జి.గురుబాబు, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి శివలంక కొండలరావు, మహిళా నాయకులు గబ్బాడ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాధాకృష్ణ ఆలయ ప్రతిష్ట

దేవరాపల్లి : మండలంలోని పెదనందిపల్లి గ్రామంలో శ్రీ రాధాకృష్ణ విగ్రహ ,ఆలయ ప్రతిష్ట మోహత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు .స్థానిక యాదవ సంఘము అధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు ,ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు ,జడ్పీటిసీ గాలి వర లక్ష్మి పలువురు నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు .విగ్రహ ప్రతిష్ట మోహత్సవాన్ని పురస్కరించుకుని భక్తులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ప్రత్యేక దర్శినానికి ఏర్పాట్లు చేశారు ఈ సంధర్భంగా గ్రామంలో పలు సంస్కృతిక కార్యక్రమలు నిర్వహించారు.

### సిపిఓలును అభినందిస్తున్న ఎస్పీ జి.పాలరాజు

కమ్యూనిటీ పోలీసులకు అధికారుల ప్రశంసలు

విజయనగరం: పార్వతీపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో కమ్యూనిటీ పోలీసులుగా పనిచేస్తున్న సిపిఓలు గుల్లిపల్లి కృష్ణ, రాగాల బ్రహ్మందొర, మీగడ చంద్రశేఖర్, కట్టమూరి శ్రీను, పి.రేవంత్‌కుమార్,డి.కిశోర్‌లను ఇల్లా ఎస్పీ జి.పాలరాజు సత్కరించారు. రారతి, పగలు పోలీసులతో పాటు దొంగతనాల నియంత్రణకు సహకరించినందుకుగాను ప్రోతాసహకాలుగా నగదు బహుమతిని అందజేసి మంగళవారం తన చాంబర్లఓ అభి నందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డి విక్రాంత్ పాటిల్, అదనపు ఎస్పీ అట్టాడ వెంకటరమణ, పార్వతీపురం ఎఎస్పీ దీపికా పాటిల్, సిఐ రాంబాబు, ఎస్ఐలు జ్ఞానప్రసాద్ పాల్గొన్నారు.

## జగద్గురుత్వమే శ్రీకృష్ణ తత్వం

- డాక్టర్ పి.స్వప్నహైందవి

విజయనగరం: జగద్గురుత్వమే శ్రీకృష్ణ తత్వమని తెలుగు భాషా పరిరక్షణ సమితి ఉపాధ్యక్షులు డాక్టర్ పి.స్వప్నహైందవి అన్నారు. శ్రీ వేంకటేశ్వరా భక్తిమండలి ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపంలో బాలకృష్ణలీలలు అనే అంశంపై ఆమె ప్రవచనం గావించారు. శ్రీముఖనామ సంవత్సరం శ్రావణ బహుళ అష్టమినాడు రోహిణి నక్షత్రం నాల్గవ పాదంలో జన్మించిన శ్రీకృష్ణునికి గర్గమహర్షి నామకరణం గావించారని వివరించారు. మన్నుతిన్నాడని మందలించిన యశోదకు నోరు తెరచి నిజ స్వరూపాన్ని చూపాడని, ఇంద్రుని గర్వాన్ని అణచి గోవిందుడైన విధానము, మధురలో ప్రదర్శించిన లీలలు, కువలయాపీడన సంహారం కళ్లకు కట్టినట్లు వివరించారు. శ్రీకృష్ణుని తత్వాన్ని పరిశీలిస్తే అతనిలో పరిపూర్ణ అవతారం, సుగుణ, నిర్గుణ రూపాలు గోచరిస్తాయని, అందుకే వేదవ్యాసుడు కృష్ణస్తు భగవాన్ స్వయం అని కృష్ణతత్వాన్ని వివరించారు.

## ప్రతిభాపాటవాలకు పట్టం కట్టాలి ఐవిపి రాజు

విజయనగరం : ప్రతిభాపాటవాలకు పట్టంకట్టాలి అని తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు అన్నారు. ఎలయన్స్‌క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-105 ఆధ్వర్యంలో పల్లవీ విద్యామందిర్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ధనవంతుడు కేవలం తన ప్రాంతంలో గౌరవం పొందుతాడని, పరాక్రమ వంతుడు తన రాజ్యంలో గౌరవం పొందుతాడని, విద్యావంతులు అన్ని వేళలా అన్ని మూలలా గౌరవానికి అర్హులని అన్నారు. ఈ సందర్భంగా జె.ఇ.ఇ.2018 అడ్వాన్స్ పరీక్షలో జాతీయ స్థాయిలో 1878 ర్యాంకు సాధించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపచేసిన (పల్లవి స్కూల్ పూర్వ విద్యార్థిని) పెద్దింటి చాందినికి 5000 రూపాయల చెక్కును బహూకరించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ సముద్రాల గురుప్రసాద్, వనితాక్లబ్ అధ్యక్షురాలు ఎం సుభద్రా దేవి, పాఠశాల డైరక్టర్ ఎస్.శేఖర్, ప్రధాన ఉపాధ్యాయిని డి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### అభయాంజనేయునికి ప్రత్యేక పూజలు

విజయనగరం: ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో అభయాంజనేయునికి ప్రత్యేక పూజలు గావించారు. దేవాలయం అర్చకులు చాణక్య ఆధ్వర్యంలో వేద పండితులు మంగళాశాసనాలతో సింధూరం, తమలపాకులతో ప్రత్యేక పూజలను గావించారు. ఈ పూజలలో ఎన్ సి ఎస్ ట్రస్ట్ డైరక్టర్ నారాయణం సీతా రామయ్య, ఉమా మహేశ్వర రావు, రమణ పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాలకు సెల్ సంకేతాలు అందేలా చూడాలి



అనంతగిరి : మండలంలోని ఎగువశోభ పంచాయతీ లోగల గురువారం హెక్టగూడ. మర్దగూడ. కొత్తవలస. గ్రామాలకు సెల్ సేవలు లేక గిరిజనులు చాలా ఇబ్బందులు పడుచున్నామని ప్రభుత్వం ప్రతీగ్రామంనకు సెల్ సేవలు అందుబాటులో కి తెస్తామని గొప్పలు చెపుతుందని వరకు సెల్ సంకేతాలు రాకా గిరిజన ప్రజలు ఇబ్బందులు పడుచున్నారని ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని సెల్ సంకేతాలు అందని గ్రామాలకు సంకేతాలు అందేటట్లు చేయాలని పైనాలుగుగ్రామాల ప్రజలు అనంతగిరి నాలుగు రోడ్ల కూడలిలో అనంతగిరి ఎంపీటీసీ ధీసరి గంగరాజు ఆద్వర్యంలో ధర్నా నిర్వహించారు

RAMANUJAN & RAMAN
Dwarakanagar- Gopalapatnam-Sujathanagar
98850 80592
OFFERS COACHING for
IIT - NEET - BITSAT

## ప్రతిభకు ఎల్‌బిఆర్ సంస్థ పురస్కారాలు

విజయనగరం : తరగని ఆస్తిని అందించటంమే విద్యాదానమంటే...మంచి భవిష్యత్‌ను కోరుకుంటూ కొందరు విద్యార్థినీ విద్యార్థులు విద్యపట్ల చూపెడుతున్న ఆసక్తి, కృషి అభినరేషన్ దనీయమని వారిని ప్రోత్సమించటం మన ధర్మమని ఎల్.బి.ఆర్ సంస్థ ప్రతినిధులు లింగం రవీంద్రబాబు (రవిబాబు..అడ్వకేటు), లింగం శరత్ బాబు అన్నారు. తమ సంస్థ ద్వారా ఇతోధికంగా మంచి మార్కులతో ఉత్తీర్ణులౌతున్న విద్యార్థులకు ఆసరా కల్పించాలని, అలాగే సమాజ మితం కోసం మా మేరకు కృషి చేయాలని సంస్థ ప్రారంభించామన్నారు. జిల్లాలోని జామి మండలం కుమరాం గ్రామంలోని ఉత్తమ విద్యార్థుల అభినందన సభని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధనియాల సీతారామయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పది పాయింట్ సాధించిన టి.కావ్య, పి.గణేశ్వరరావు, ఎమ్.పవన్ కుమార్‌లకు ఒక్కొక్కరికి 5వేల 116 రూపాయలు, అభినందన పత్రం అందించారు. అలాగే 9.8 సాయింట్లు సాధించిన ఎమ్.భాను, ఎస్.దుర్గకె.దీపిక, జి.నీరజ, సి.హెచ్.వెంకట సునీల్, ఆర్.సూర్యకళ, బి.కుమారస్వామిలకు ఒక్కొక్కరికి 3వేల 116 రూపాయలు నగదు మరియు ప్రసంసా పత్రం అందించారు.

మండల విద్యావాఖాధికారిణి జె.జయశ్రీమాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల ప్రోత్సాహకాలు విద్యార్థులకు స్ఫూర్తిని ఇస్తాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు సబ్బవరపురమణయ్య విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులుపాల్గొన్నారు.

## రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలకు సర్వం సిద్ధం



విజయనగరం: రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలకు సర్వం సిద్ధం అయిందని న్యావాదుల సంఘ అధ్యక్షులు , ఎన్నికల అధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 29వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్ర మొత్తం మీద 107 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని జిల్లా నుండి ఒక్క అభ్యర్థి పోటీ చేస్తున్నారని తెలిపారు. జిల్లా వ్యాపితంగా 435 మంది ఓటర్లు ఉన్నారని ఎన్నికలు 29వ తేదీ ఉదయం 10 గంటల నుండి సాయత్రం 5 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఈ బ్యాలెట్టు అన్ని సీల్ వేసిరాష్ట్ర బార్ కౌన్సిల్‌కు హైదరాబాద్ పంపిస్తారని తెలిపారు. ఓట్ల లెక్కింపు హైదరాబాద్‌లో జులై 10వ తేదీ ప్రారంభమౌతుందని తెలియజేశారు. ఓటర్లు తప్పని సరిగా బార్ అసోసియేషన్ ఇచ్చిన గుర్తింపు కార్డులతో ఓటింగుకు హాజరుకావాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గంగాధర్ పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపారు.ఒన్, టూ, త్రి, ఫోర్, ఫైవ్ అనే విధంగా తప్పనని సరిగా వ్రాసి ఓట్లు వేయాలన్నారు.

**ఐ.వి.ఎం.గోదాములకు స్థల పరిశీలన**

నెల్లిమర్ల మండల కేంద్రంలోని ఐ.వి.ఎం.గోదాములను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా.హరి జవహర్‌లాల్ బుధవారం జిల్లాకు అదనంగా వచ్చే 6 వేల ఇ.వి.ఎం.లను బధ్రపర్చేందుకు స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుం వున్న ఇ.వి.ఎం.గోదాము అదనంగా వచ్చే 6 వేల ఇ.వి.ఎంలు బధ్రపర్చేందుకు స్థలం చాలదని గోదాము మొదటి అంతస్తు త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత ఆర్.అండ్.బి. అధికారులను ఆదేవించారు. రెండు, మూడు నెలల్లో మొదటి అంతస్తు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనంగా వచ్చే ఇ.వి.ఎం.లను తాత్కాలికంగా బధ్రపర్చే విధంగా జిల్లా జేటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో ఉన్న రెండు సమావేశ మందిరాలు, రెండు గదులు పరిశీలించారు. వాటిని బధ్రపర్చే అవకాశాలు అడిగి తెలుసుక కున్నారు.

ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఆర్ జె.వెంకటరావు, డ్వామా పి.డ.ఇ రాజగోపాల్, విజయనగరం డి.ఆర్.ఓ మురళి, ఎన్నికల సూపరెంటెండెంట్ ఆదిలక్ష్మి, నెల్లిమర్ల తహసిల్దారు కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో సాధనలో పని తీరు మెరుగుపర్చుకోండి

*జిల్లా కలెక్టర్ జవహర్‌లాల్*

విజయనగరం: జిల్లా అభివృద్ధిలో భాగస్వాములయ్యే వివిధ శాఖలు తమ పని తీరు మరింత మెరుగుపర్చుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఎం.హరిజవహర్‌లాల్ పేర్కొన్నారు. బుధవారం జిల్లాలోని వివిధ మండలాల్లో జరుగుతున్న అభివృద్ధిపై జరిగిన వీడియో కాన్ఫెరెన్సులో జిల ్లా అధికారులతో కలిసి మండల అబివృద్ధి అధికారులతో సమీక్షించారు. గ్రామాలలోని సి.సి.రోడ్ల నిర్మాణంలో 183 కి.మీ కాగా లక్ష్య సాధన అధికారులు చెబుతున్న దానికన్నా చక్కని ప్రగతి సాధించాలన్నారు. అంగన్వాడీలకు సొంత భవనాలు చాలా అవసరమని నిర్మాణంలో ఉన్న భవనాలు మూడు నెలల్లో పూర్తిచేయాలన్నారు. జిల్లాలోని పంచాయితీలకు కావలసిన సొంత భవనాల నిర్మాణాలు త్వరితపర్చాలన్నారు.

పశుగ్రాస క్షేత్రాలు 1540 ఎకరాలలో నిర్మించవలసి వున్నదని, క్షేత్రాలలో పూర్తి గ్రాసం వచ్చినప్పునడే పశువులకు పూర్తి గ్రాసం అందుతుందన్నారు.

# కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయండి

## మాజీ కేంద్రమంత్రి పి.అశోక్ గజపతిరాజు



విజయనగరం : కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు తోడ్పడాలని మాజీ కేంద్రమంత్రి పి.అశోక్‌గజపతిరాజు డిమాండ్ చేశారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోరుతూ బుధవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి దోహదపడే ఉక్కు పరిశ్రమకోసం 20వేల కోట్లు ఎందుకివ్వరని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న అపారమైన ఖనిజ నిక్షేపాలు గనుల మాఫియాకి కనిపిస్తున్నాయని, కానీ ప్రదాని మోడీకి ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ హక్కులను కాలరాస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. రాజ్యసభ సభ్యుడు సిఎం రమేష్, ఎమ్మెల్సీ బిటెక్ రవిలు చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు అన్ని వర్గాల ప్రజల నుంచి మద్దతు లభిస్తోందన్నారు. కడప ఉక్కు పరిశ్రమపై సంతకాలు సేకరించిన ఫ్లెక్సీని ప్రధానమంత్రి మోదీకి పంపిస్తామన్నారు.

గతంలో విశాఖ ఉక్కును సాధించుకున్న స్ఫూర్తితో కడప ఉక్కుపరిశ్రమ ఏర్పాటుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉక్కు పరిశ్రమ సాధించేవరకు శాంతియుత వాతావరణంలో ఉద్యమాలు, ఆందోళనలు చేస్తామన్నారు. రాష్ట్రహక్కులకోసం మనందరం సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ డా.శోభాస్వాతిరాణి, ఎమ్మెల్యే మీసాల గీత, మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, గ్రంధాల సంస్థ చైర్మన్ బొద్దల నర్సింగరావు, వాజీఛానల్ ఎండి జి.శ్రీనివాసరావు, ఎఎంసి చైర్మన్ సైలాడ త్రినాధ్, తెదేపా రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎన్.ఎం.రాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు డా.వి.ఎస్.ప్రసాద్, తుంపల్లి రమణ, కెంగువ శ్రీను, వేచలపు శ్రీనివాసరావు, తిక్కాన చినదేముడు, పిన్నింటి సూర్యనారాయణ, ఆల్తి బంగారుబాబు, కెల్ల సూరిబాబు, ఉంద్రాళ్ల వెంకటప్పారావు, మైలపల్లి పైడిరాజు, కోండ్రు శ్రీను, గేదెల ఆదిబాబు, పెంటకోట సత్యనారాయణ, ఎస్.కె.ఎం.భాషా, పాండ్రంకి గౌరీసూరప్పడు, తోలాపి మోహనరావు, రొంగలి రామారావు, పాగిరి పైడిరాజు, సారిక వెంకటరమణ, పిన్నింటి కళావతి, గంటా పోలినాయుడు, నేవీ రాజు, వారణాశి మల్లిబాబు, పొల్నేటి మహేష్, చంటిరాజు, రాజునాయుడు, వేమల చైతన్యబాబు, గొండేల ప్రకాష్, కింగ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### *పండగ వాతావరణంగా ఏరువాక పౌర్ణమి*

**-విజయనగరం జిల్లా కలెక్టర్ డా. హరి జవహర్ లాల్**

విజయనగరం : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు ఈ నెల 28వ తేదీన ఏరువాక కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా పండగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. హరి జవహర్ లాల్ తెలిపారు. ఆ రోజున రైతు సోదరులు పశు వులను, అరకలను, వ్యవసాయ పనిముట్లను అలంకరించి నవదాన్యాలు వెదజల్లి, మంచి దిగుబడులు రావాలని వరుణ దేవుణ్ణి ప్రార్దిస్తారని వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఏరువాక కార్యక్రమాన్ని భోగాపురం మండలం పోలిపల్లి గ్రామంలో ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ ఏరువాక కార్యక్రమంలో జిల్లా మంత్రులు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్, శాసన మండలి, శాసన సభ్యులు, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొని రైతులతో వ్యవసాయ పద్ధతులు గూర్చి చర్చిస్తారని, ప్రదర్శన శాలలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తారని తెలిపారు.

ఈ ఏరువాక కార్యక్రమంలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేసారు.

## బజారులో అంగన్వాడీ సరకులు వస్తే చర్యలు

విజయనగరం: జిల్లాలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలకు అనుబంధ పోషకామారం కార్యక్రకమం క్రింద సరఫరా అవుతున్న బియ్యం, పప్పు, నూనె, బాలామృతం, కోడి గ్రుడ్లు పాలు, తదితర సరుకులు నల్లబజారులో కొనుట, లేదా అమ్ముట నేరము మరియు శిక్షార్హమని జిల్లా స్త్రీ మరియు శిశు అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు తెలిపారు. నిత్యావసర సరుకుల చట్టం 1955 సెక్షన్ 6 (ఎ) ప్రకారం అమ్మినవారు, కొన్నవారు శిక్షార్హులని హెచ్చరించారు. అదే చట్టం ఏపి రాష్ట్ర పిడిఎస్ నియంత్రణ ఉత్తర్వులు 2008, క్లాజ్ నెం.7 ప్రకారం నిబంధనలు అతిక్రమించిన వారు శిక్షార్హులని తెలిపారు.

సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు చట్టానికి లోబడి బాధ్యత నిర&్వహించాలన్నారు. లేనిపక్షంలో చట్టప్రకారం శిక్షార్హులని మరియు ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు ఈసుకుంటామని హెచ్చరించారు.

# భగవంతునికి శఠగోపం... భక్తులపై కోపం

విజయనగరం : తూర్పుంటి అంకాళమ్మ, పడమటింటి నూకాలమ్మ, దక్షిణాన గంగాలమ్మ...ఏదిక్కున ఏది వెలిసినా..ఎవరు దేనినిమొక్కుకున్నా అది వెలిసినా, కట్టినా అదంతా మాదే అనే దేవాదాయశాఖ.. వారికి .కొత్తగా కనబడిన భూములన్ని గుడులప్రక్కన ఉంటే మావే అనే చందంగా తయారైంది. చరిత్రని ఆపాదించి ఎవరో నలుగురు కమిటీ ఏది చెప్పినా దానిని గుడ్డిగా నమ్మి ఆదాయం బాగున్నా, లేదా ఆ గుడిక్రింద మాన్యాలున్నా సదరు శాఖ కన్నుపడుతుంది. దానికి కమిటీ కాస్త వారి అవసరాలకు చనువిచ్చిందంటే చాలు చెంకనెక్కి కూర్చుంటుంది. అలాంటి పరిస్థితే విజయనగరం కేంద్రంలో ఉన్న మన్నారు రాజగోపాలస్వామి దేవాలయ పరిసరాల్లో ఇప్పుడు కన్పిస్తోంది. ఆ దేవాలయానికి 700 ఏళ్ళ చరిత్ర వుందని ఆఖరికి కేంద్ర మాజీ మంత్రి, ప్రస్తు పార్లమెంటు సభ్యులనే బురిడీ కొట్టిద్దామని కేంద్రం నిధులు రప్పిద్దామని తెగ తాపత్రయపడ్డారు. కానీ వారి ప్రయోగం మొదటిలోనే బెడిసి కొట్టింది. కారణం దానికన్నా పురాతన , చారిత్రక ఆధారాలు, వైభవం ఉన్న శ్రీరామతీర్థాలు ఉంది. ఇక విషయానికి వస్తే ఇటీవల పర్యాటక అభివృద్ధిపేరుతో కొంత వచ్చింది. అయినా వారికి సంతృప్తిలేదు. వచ్చే భక్తులు కాస్త ఉన్న వారైతే వారిని ఎలా ఊడ్చీయాలో వారికి తెలుసు, ప్రత్యేక దర్శనాలతో పాటు వారికి కావలసిన అన్ని 'సౌ'కర్యాలు కల్పిస్తారు. వారిచ్చిన కానుకకకలకు నగదైనా...నగలైనా రశీదు ఇవ్వరు. భక్తుల నమ్మకాన్ని చాలా జాగ్రత్తగా కాపాడుంటారు. ఇది స్థానికులకు తెలిసి ప్రశ్నించడం మొదలు పెట్టారు. ఇక అక్కడ కథ మొదలైంది. వెంటనే అది ప్రొహిబిటెడ్ ఏరియా అని ంఔరిజిస్ట్రార్ కార్యాలయంలో కొర్రి వేశారు. నిజానికి అది ప్రేవేటు స్థలం కారణం. కొత్తపేట నార్త్ వార్డులో ఉన్న ఇది పురాతనమైంది. దానిని కొనుగోలు చేసిన వారు కీ.శే.లింగం భోగేశ్వరరావు. అది వారి కుటుంబానికి వారసత్వంగా నేడు సంక్రమించింది. దానిని వారిపేరు మీద బదిలీచేయించుకుందామంటే దేవదాయశాఖ అడ్డింది. వెంటనే సదరు హక్కుదారులు 1983 నుంచి ఇప్పటి వరకు అది ప్రేవేటు భూమి అని దాఖలా పరిచి ధృవపత్రం ఇచ్చారు. 2016లో ఆనాటి దేవదాయ శాఖ అది వారి భూమి అని పెట్టిన అభ్యంతరానికి అర్ధం లేదని తెలిసింది. ఇక అలాగే దాని ప్రక్కనే ఉన్న టౌన్ సర్వే నెంబరు 950లో ఉన్న స్థలానికి ఇలాగే మొకాలడ్డు వేశారు. స్థానిక న్యాయస్థానం అదే ప్రేవేటు స్థలమని చెప్పినా విన్పించుకోలేదు. ఇప్పటికే 7 అడుగులు ఒకవైపు, 3 అడుగులు వేరొక వైపు కొట్టేశారు. ఇక లాభంలేదని స్థల యజమానులు పురపాలక సంఘాన్ని ఆశ్రయించి స్థలం కొలతలు వేయమన్నారు. కానీ, వారు రాలేదు. రెవిన్యూ అధికారులను సంప్రదించారు. వారు కదలలేదు. కారణం ఏమిటని ప్రవ్నించుకున్నారు. కమిటీలో చాలా బడాబాబులు ఉన్నారట. వారిని కాదని ఎలా వస్తాం? అన్న ప్రశ్న వేస్తున్నారు. దేవాలయం సంగతికి వస్తే ఏ రోజు ఏ కార్యక్రమానికి ఎంత ఖర్చు అవుతున్నాదో అడిగితే చెప్పరు. సామాన్యభక్తులను పట్టించుకోరు. సమీపనివాసితులతో ఏదో ఒక పేచీ. ఆ దేవాలయానికి ధర్మం అంటే పడదు. ప్రభుత్వ అధికారులకు చట్టం అంటే గిట్టదు. కమిటీకి న్యాయం అంటే సొక్కదు. ఇదీ సంగతి. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని మా సమస్యలు పరిష్కరించడని కోరుతున్నారు.

## వ్యవసాయ పనులకు శ్రీకారం

# ఏరువాక పౌర్ణమి


**ఏరువాక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక కథనం**

విజయనగరం : భారత దేశం ప్రధానంగా వ్యవసాయ ఆధారిత దేశం. రైతే దేశానికి వెన్నెముక. కనుక వ్యవసాయాభివృద్ధిలో మనం ప్రగతి సాధించిన నాడే గ్రామ పురోభివృద్ధితో పాటు జిల్లా, రాష్ట్ర, దేశ పురోభివృద్ధి జరుగుతుంది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయానికి అత్యధిక ప్రాదాన్యతనిచ్చి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోన్న విషయం విదితమే. అందులో భాగంగానే ప్రతి ఏట రాష్ట్ర ప్రభుత్వం ఏరువాక కార్యక్రమాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తోంది.

**ఏరువాక అంటే:** ''ఏరు'' అంటే... ఎద్దులను కట్టి దుక్కి దున్నుటకు సిద్దపరచిన నాగలి. 'ఏరువాక'... అంటే దుక్కి దున్నుట ప్రారంభం అని అర్థం. వర్షఋతువులో జ్యేష్ఠ మాసంలో పూర్ణమీ రోజున తెలుగు రైతులు ఏరువాక పున్నమిగా జరుపుకుంటారు. తొలకరి జల్లుల ఆగమనంతో రైతులు ఆనందోత్సాహాల మధ్య అరక దున్నటంతో పొలం పనులు మొదలుపెడతారు. సాంప్రదాయికంగా రైతులు ఏరువాక పున్నమిని పండుగలా జరుపుకుంటారు. ఆ రోజు ఎద్దులను, నాగలిని చక్కగా కడిగి రంగులతో, రంగురంగుల పువ్వులతో అలంకరిస్తారు. భూమాతకు పూజ చేసి, ధూప, దీప, నైవేద్యాలు సమర్పించి ఎడ్లకు పొంగలిని ఆహారంగా పెడతారు. అనంతరం రైతులందరూ సామూహికంగా ఎద్దులను తోలుకుని పొలాలకు వెళ్లి దుక్కి దున్నుతారు. రోజులు మారాయి చిత్రములో '' ఏరువాక సాగారో రన్నో చిన్నా... నీ కష్టమంతా తీరునురో రన్నో చిన్నన్నా...' ఈ పాట తెలియని తెలుగు వారుండరు అంటే అతిశయోక్తి కాదు. పొలంలో పంట పండి చేతికి వస్తేనే కదా మన కష్టాలు తీరేది. ఎందుకంటే మనది వ్యవసాయ ప్రధానదేశం. అందుకే మన దేశంలో వ్యవసాయాన్ని ఓ పవిత్ర కార్యంలా, తపస్సులా చేస్తారు.. ఇక్కడి రైతాంగం. దేశాన్ని సస్యశ్యామలం చేసి, మానవాళి ఆకలి తీర్చే చల్లని తల్లి, భూమాత. అట్టి తల్లి గుండెలపై నాగలి గ్రుచ్చి, దుక్కి దున్నడం రైతన్నకి బాధాకరమైన విషయమే అయినా , బ్రతకాలంటే దుక్కి దున్నక తప్పదు కదా! అందుకని, వ్యవసాయ ప్రారంభానికి ముందు, భూపూజ చేసి, ఆ తల్లి ఆశీస్సులందుకునేందుకు చేసే పండగే ఈ ''ఏరువాక పున్నమి పండుగ.

**ఏరువాక సందర్భంగా గత ఏడాది జిల్లాలో చేపట్టిన ప్రగతి కార్యక్రమాలు :**

**వ్యవసాయ రుణ ఉపశమన పత్రాలు:** రైతులు సంక్షోభం నుండి బయట పడటానికి, వారికి చేయూతను అందించే దిశగా 2013 డిసెంబర్ 31 వరకు ఉన్న వ్యవసాయ రుణాలను ఒక్కో కుటుంబానికి గరిష్టంగా 1.50 లక్షలరూపాయలు రుణ మాఫీకి నిర్ణయించి రుణ ఉపశమన గావించింది. అందులో



భాగంగా జిల్లాలో 2,15,719 మంది రైతులు రూ.573.27 కోట్లు ఉపశమనం పొందగా ఇప్పటివరకు మూడు విడతల్లో, రూ.459.21 కోట్లు విడుదల చేయటం జరిగింది.

అదేవిధంగా కేవలం రెండు శాతం ప్రీమియం చెల్లింపుతో ప్రధానమంత్రి ఫసల్ భీమ యోజన పథకం క్రింద పంటల భీమాను అందించటం జరుగుతోంది. గత ఏడాది పంట రుణాల లక్ష్యం రూ.1850 కోట్లకు గాను రూ.1905 కోట్లు రుణాలు అందించి 103 శాతం సాధించటం విశేషం. గత ఖరీఫ్, రభిలలో 2.75 లక్షల హెక్టార్ల సాదారణ విస్తీర్ణానికి గాను 2.65లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేసారు. అదేవిధంగా 2.15 లక్షల భూసార పరీక్ష ఫ్లలితాల పత్రాలను రైతులకు అందజేశారు. 3,225 మెట్రిక్ టన్నుల సూక్ష్మ పోషకాలను శత శాతం రాయితీ మీద, 37,400 క్వింటాళ్ళ విత్తనాలు, 1 లక్ష 6 వేల మెట్రిక్ టన్నుల రసాయన ఎరువులు, రాయితీ మీద రైతులకు అందజేశారు. ఉత్తమ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించటానికి 1710 హెక్టార్లలో చంద్రన్న రైతు క్షేత్రాలు నిర్వహించారు. 4,352 గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా 1.17 లక్షల మంది రైతులకు పురుగు మందులు, ఎరువుల వాడకం తగ్గించటంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ యంత్రీకరణ పథకం క్రింద రూ.16.27 కోట్ల విలువగల పనిముట్లను రాయితీపై అందించారు. జాతీయ ఆహార భద్రతా పథకం క్రింద 23,800 హెక్టార్లలో నేరుగా విత్తడం తో పాటు రైతుకు అదనపు ఆదాయం కోసం 12 వేల హెక్టార్లలో పొలం గట్లపై కంది సాగును ప్రోత్సహించటం జరిగింది.

**ఏరువాక సందర్భంగా ఈ ఏడాది జిల్లా ప్రణాళిక :**

ఈ ఏడాది పంట రుణాలు రూ.2035 కోట్లు అందించటానికి నిర్ణయించారు. ఈ ఖరీఫ్ లో 1.91 లక్షల హెక్టార్లలో పంటలు వేయటానికి లక్ష్యంగా పెట్టుకున్నారు. అదేవిధంగా ఈ ఖరీఫ్ లో 2,083 మెట్రిక్ టన్నుల సూక్ష్మ పోషకాలను శత శాతం రాయితీపై అందించటానికి, 49వేల క్వింటాళ్ళ విత్తనాలు, 1 లక్ష 78 వేల మెట్రిక్ టన్నుల రసాయన ఎరువులు రాయితీపై సరఫరా చేయటానికి నిర్ణయించారు. 1280 హెక్టార్లలో చంద్రన్న రైతు క్షేత్రాలు నిర్వహించటానికి చర్యలు చేపట్టారు. సేంద్రీయ సహజ వ్యవసాయానికి ప్రాధాన్యతనిస్తూ జిల్లాను 52 క్లస్టర్లుగా విభజించి 92 గ్రామాల్లో సహజ వ్యవసాయానికి చేయూతనందిస్తారు. ఖరీఫ్ లో నలుగు, రభిలో నాలుగు నెలలు పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పొలం బడి ద్వారా పురుగు మందులు, ఎరువుల వాడకాన్ని తగ్గించే దిశగా రైతులను చైతన్యవంతులుగా తీర్చిదిద్ది వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చటానికి సంకల్పించారు.

ఈ ఏడాది రూ.20 కోట్లు విలువగల వ్యవసాయ యాంత్రీకరణ వివిధ పనిముట్లను రాయితీపై సరఫరా చేయటానికి నిర్ణయించారు. జాతీయ ఆహార భద్రతా పథకం క్రింద రూ.7.54 కోట్లతో విత్తన రాయితీ, క్షేత్ర ప్రదర్శన, శిక్షణ కార్యక్రమాలు, చేపట్టుటకు ప్రణాళిక సిద్ధం చేసారు.

# జిమ్‌సర్ ఆస్పత్రిలో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం

## జిమ్‌సర్ సేవలు అమోఘం

### జిమ్‌సర్ ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శ్యామ్‌బాబు




సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) ఆస్పత్రి ద్వారా కేంద్రప్రభుత్వ ఆరోగ్య పథకం (సిజిహెచ్‌ఎస్) సేవలు అమలులోకి తీసుకువస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వ శాఖలలో పనిచేసే ఉద్యోగస్తులు, పదవీ విరమణ పొందిన వారు, న్యాయశాఖకు చెందినవారు, పాత్రికేయులు, ఇతరత్రా విభాగాల వారు వైద్య సేవలను పొంద వచ్చునని జిమ్‌సర్ ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శ్యామ్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిమ్‌సర్ వైద్య సేవలను సిజిహెచ్‌ఎస్ పథకం కింద పొందగోరే వారు ముందుగా తమ పేర్లను ఆస్పత్రిలో నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు.

**జిమ్‌సర్ ఆస్పత్రి:**

గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) ఆస్పత్రి 650 పడకలతో నిపుణులైన వైద్యలతో వివిధ సేవలను అందిస్తోందని డాక్టర్ శ్యామ్‌బాబు తెలిపారు. అయిదు ఆపరేషన్ థియేటర్‌లతో పాటు ఐసియు విభాగాలు, సర్జికల్ ఇన్‌సెంటివ్ కేర్ యూనిట్, బ్లడ్ బ్యాంక్, 24 గంటలు పనిచేసే ప్రయోగశాలలు, సిటీస్కాన్, ఎక్స్‌రే పరీక్షా విభాగం వంటివి ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రశాంత వాతావరణంలో నిరుపమాన సేవలను అందిస్తున్న జిమ్‌సర్ ఆస్పత్రిని సిజిహెచ్‌ఎస్‌కు కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# ఏపీ కొత్త డీజీపీ ఎంపిక కోసం కమిటీ..

## రేసులో గౌతమ్ సవాంగ్, ఠాకూర్ పేర్లు






అమరావతి : ఏపీ కొత్త డీజీపీ ఎంపికపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. డీజీపీ మాలకొండయ్య ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేయనుండటంతో.. కొత్త పోలీస్ బాస్ ఎంపిక కోసం ఇంఛార్జ్ సీఎస్ పునేఠా నేతృత్వంలో సీనియర్ ఐఏఎస్‌లు మన్మోహన్ సింగ్, సాంబశివరావు, శ్రీకాంత్‌లతో ఓ కమిటీని నియమించింది. శుక్రవారంలోపు టాప్-3 లిస్ట్‌ను సిద్ధం చేయాలని కోరింది. కమిటీ సంగతి ఇలా ఉంటే డీజీపీ రేసులో ఉన్న అధికారుల పేర్లపై అప్పుడే ప్రచారం ఊపందుకుంటోంది. ప్రధానంగా ఇద్దరు పేర్లు తెరపైకి వచ్చాయి.

డీజీపీ రేసులో విజయవాడ సీపీ గౌతమ్ సవాంగ్, ఏసీబీ డీజీ ఆర్పీ ఠాకూర్ల పేర్లు వినిపిస్తున్నాయి. సవాంగ్ మొదటి నుంచి వివాదరహితుడు.. కాల్‌మనీ కేసులో సమర్థవంతంగా పని చేశారనే మంచి పేరు ఉంది. ఇటు ఠాకూర్ కూడా ఏసీబీ కేసుల్లో కఠినంగా వ్యవహరిస్తూ అవినీతి అధికారులు ఆట కట్టిస్తున్నారు. అయితే ఈ ఇద్దరిలో కూడా సవాంగ్‌వైపే ప్రభుత్వం మొగ్గు చూపుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సవాంగ్, ఠాకూర్ సంగతి అలా ఉంటే.. సీనియార్టీ లిస్ట్ ప్రకారం సీనియారిటీలో రమణమూర్తి ఉన్నా.. ఆయన ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఇక 1986 బ్యాచ్‌కు చెందిన వీఎస్ కే కౌముది కేంద్ర సర్వీసుల్లో.. వినయ్ రంజన్ జైళ్లశాఖ డీజీగా ఉన్నారు. ఆ తర్వాతి బ్యాచ్ నుంచి ఎన్.వి.సురేంద్రబాబు ఏపీఎస్ ఆర్టీసీ ఎండీగా.. ఏ.ఆర్.అనురాధ హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా కొనసాగుతున్నారు. వీరిలో కౌముది కేంద్రంలో ఉండగా.. రంజన్ కూడా ఆరోగ్యపరమైన సమస్యలతో ఉన్నారు. మిగిలిన వాళ్లు జూనియర్లు కావడంతో.. రేసులో సవాంగ్, ఠాకూర్‌లు మాత్రమే ఉంటారనే ప్రచారం జరుగుతోంది.

# ఉత్తరాంధ్ర మరో తెలంగాణ అవుతుంది



**మొదటిపేజి తరువాయి :**

కార్యక్రమంలో పవన్ పాల్గొని మేధావుల ఆలోచనలు, సూచనలు, అభిప్రాయాలను విన్నారు. ఉత్తరాంధ్రకు చెందిన ప్రొఫెసర్ జి.ఎస్.చలం, ప్రొఫెసర్ కె.వి.రమణ, ప్రజా గాయకుడు వంగపండు తదితర మేధావి వర్గం పాల్గొంది.

చర్చా కార్యక్రమం అనంతరం పవన్ కళ్యాణ్ ట్విట్టర్ ద్వారా స్పందించారు. ఉత్తరాంధ్ర సమస్యలపై వరసపెట్టి ట్వీట్లు చేశారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పెద్దలు నడుపుతున్న మైనింగ్స్ కారణంగా అక్కడి ప్రజల పరిస్థితులు ఎంత దారుణంగా మారాయో ట్వీట్లలో వివరించారు. ఉత్తరాంధ్రలో విచాక్షణారహితంగా మైనింగ్ జరుగుతోందని మేధావులు వెల్లడించారు. రాయలసీమ ఫ్యాక్షన్ లీడర్స్, ఉత్తరాంధ్ర నాయకులు తమ ఏజెంట్ల ద్వారా గిరిజన ప్రాంతాల్లో మైన్స్ నిర్వహిస్తున్నారు. వాళ్ల దురాశకు అక్కడి ప్రజల జీవితాలు నాశనమవుతున్నాయి. అనారోగ్యం, ఆస్తి నష్టం, పర్యావరణ కాలుష్యం, ఆర్థిక అసమతుల్యతకు కారణమవుతున్నాయి అంటూ పవన్ ట్వీట్ చేశారు. ఉత్తరాంధ్ర ప్రజలు, యువత, మహిళలు, మేధావులు తమ ఆత్మ గౌరవం, రాజకీయ-ఆర్థిక సమానత్వం కోసం బలమైన ఉద్యమాన్ని లేవదీయడానికి సిద్ధమవుతున్నారని పవన్ పేర్కొన్నారు. ప్రస్తుత పాలకులను వారు నమ్మడంలేదని, వాళ్లు బయటికి చెప్పకపోయినా అది స్పష్టంగా కనిపిస్తోందని చెప్పుకొచ్చారు. ప్రతి ఒక్కరిలోనూ సామాజిక-రాజకీయ స్పృహ పెరుగుతోందని పేర్కొన్నారు.

సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధిలో అన్యాయాన్ని ఎదుర్కొంటున్నట్లు వారు గ్రహించారని తెలిపారు. ఇది సామాజికి ఉద్యమానికి దారి తీస్తుందన్నారు. ఇక్కడి పరిస్థితుల్ని చూస్తుంటే దశాబ్దాల నియంత పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్ర ఉద్యమం, బ్రెగ్జిట్, కేతలోనియా జాతీయోద్యమం లేదంటే ఈజిప్టు అరబ్ విప్లవం వచ్చినట్లుగా ఉత్తరాంధ్ర ఉద్యమం కూడా వస్తుంది అని పవన్ తన ఆఖరి ట్వీట్‌లో పేర్కొన్నారు. ఏపీలో వెనుకబడిన ప్రాంతాల్లో ఏ జరగబోతోందో వేచి చూడాలన్నారు.

# అమరావతికి సింగపూర్ సహకారం

**విజ్ఞాన సమాచార మార్పిడిపై అవగాహన**

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సింగపూర్ మధ్య కీలక అవగాహన ఒప్పందం కుదిరింది. విజ్ఞాన సమాచార మార్పిడిపై అవగాహన కుదిరింది. నిర్మాణ సామగ్రి తయారీ, నగర ఏర్పాటుకు సహకరించాలని సింగపూర్ ప్రభుత్వాన్ని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు కోరారు. సింగపూర్ కుటుంబ, సామాజికాభివృద్ధి శాఖ మంత్రి డెస్మాండ్ లీ నేతృత్వంలోని బృందం సచివాలయంలో చంద్రబాబుతో ప్రత్యేకంగా సమావేశమైంది. పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి కరికాల వళవన్, సింగపూర్ భవన నిర్మాణాల అథారిటీ సీఈవో ఒప్పందాలపై సంతకాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ఇప్పటికే సుదీర్ఘ ప్రయాణం చేశామని సింగపూర్ మంత్రి లీ గుర్తుచేశారు. 25ఏళ్లుగా సింగపూర్ అభివృద్ధిని నిశితంగా పరిశీలిస్తున్నామని చంద్రబాబు అన్నారు. అమరావతి నిర్మాణంలో సింగపూర్ అందిస్తున్న సహకారం మరిచిపోలేనిదని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు.

# ప్రధాని మోదీతో కేటీఆర్ భేటీ

**ప్రైవేటు పెట్టుబడులకు పెద్దయెత్తున రాయితీలు**

**కేంద్రం సాయం చేస్తే మరింత అభివృద్ధి**

దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో తెలంగాణ మంత్రి కేటీఆర్ బుధవారం భేటీ అయ్యారు. బయ్యారం ఉక్కు కర్మాగారం, ఐటీఐఆర్ ఏర్పాటును వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు.

అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. విభజన హామీలను తర్వగా అమలు చేయాలని ప్రధానిని కోరినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ హామీలు, 10 ప్రతిపాదనలను ప్రధాని ముందు ఉంచినట్లు చెప్పారు. ఐటీఐఆర్‌కు కేంద్ర సహకరిస్తే మరింత వేగంగా అభివృద్ధి సాధిస్తామని పేర్కొన్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు పెట్టుబడులకు పెద్దయెత్తున రాయితీలు ఇస్తోందని.. ప్రభుత్వ సంస్థలు పెట్టుబడులకు ముందుకొస్తే మరిన్ని రాయితీలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

వినూత్న ఆలోచనలు, సంక్షేమ పథకాలతో దూసుకెళ్తున్న తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం చేయూతనిస్తే మరింత అభివృద్ధి సాధిస్తామని పేర్కొన్నారు.

### అర్జెంటీనా గెలుపు..

# మారడోనా సంబరాలు

ఫిఫా ప్రపంచకప్‌లో తీవ్ర ఉత్కంఠ నడుమ అర్జెంటీనా నాకౌట్ చేరింది. తొలి రెండు మ్యాచ్‌ల్లోనూ పేలవ ప్రదర్శనతో నిరాశపరిచిన ఆ జట్టు.. నైజీరియాతో మంగళవారం రాత్రి జరిగిన చావోరేవో మ్యాచ్‌లో అద్భుతంగా ఆడి 2-1 తేడాతో విజయాన్ని అందుకుంది. నాకౌట్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్ కావడంతో.. అర్జెంటీనా అభిమానులతో స్టేడియం కిక్కిరిసిపోయింది. టోర్నీ ఆరంభం నుంచి లియోనల్ మెస్సీ విఫలమవుతున్నా.. అతనికి మద్దతుగా నిలుస్తూ వచ్చిన అర్జెంటీనా దిగ్గజ ఫుట్‌బాలర్ మారడోనా ఆ జట్టు గెలవగానే తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. మ్యాచ్ 14వ నిమిషంలో లియోనల్ మెస్సీ, 86వ నిమిషంలో మార్కోస్ రొజో గోల్ కొట్టిన సమయంలో.. మారడోనా గాల్లోకి పంచ్‌లు విసరుతూ సంబరాలు చేసుకున్నాడు.



జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి మర్యాదపూర్వకంగా కలిసిన గాజువాక మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట రామయ్య

### కాంగ్రెస్‌లోకి మాజీ సీఎం

# కిరణ్‌కుమార్‌రెడ్డి?

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారని వస్తున్న వార్తలకు మరింత బలం చేకూరింది. కాంగ్రెస్‌కు చెందిన రాజ్యసభ ఎంపీ టి.సుబ్బిరామిరెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని కిరణ్‌కుమార్‌రెడ్డి నివాసానికి వెళ్లి చర్చలు జరిపారు. నిన్న మాజీ కేంద్రమంత్రి పల్లంరాజు కూడా ఆయన ఇంటికి వెళ్లి చర్చించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కిరణ్‌కుమార్‌రెడ్డి మళ్లీ సొంత గూటికి చేరనున్నారని వస్తున్న ఊహాగానాలు నిజమయ్యేలా కనిపిస్తున్నాయి. సుబ్బిరామిరెడ్డి సైతం కిరణ్‌కుమార్‌రెడ్డిని తిరిగి పార్టీలోకి ఆహ్వానించడానికి వచ్చినట్లు విలేకరుతో చెప్పడం గమనార్హం.

ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం ఏపీలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా తుడుచుపెట్టుకుపోయిన సంగతి తెలిసిందే.

LOANS / లోన్స్
HAPPY HOMES
We arrange Business Loans
Mortgage Loans
Home Loans Personal Loans
and Pvt. Loans... Etc.,
94902 33750

# కేవి గ్యాస్ ఇన్సులేటెడ్ విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభం

## నిరంతరాయ విద్యుత్‌కు ప్రత్యేక ఫీడర్





విశాఖపట్నం: జివియంసి కమిషనర్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఆంధ్రరాష్ట్రంలోనే మొట్టమొదటి 33/11 కేవి గ్యాస్ ఇన్సులేటెడ్ విద్యుత్ ఉపకేంద్రం ఏపీపిడిసియల్ సియండి హెచ్.వై.దొర మరియు జివియంసి కమిషనర్ హరినారాయణచే సాంకేతికంగా ఆవిష్కరించారు. ఈ విద్యుత్ ఉపకేంద్రం సుమారు 6కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ పవర్ డవలప్‌మెంట్ స్కీం నిధులతో నిర్మించబడినది. దీనివలన జివియంసి చుట్టు ప్రక్కల ప్రాంతంలో వున్న సుమారు 5000 మంది వినియోగదారులకు మరింత మెరుగైన నాణ్య వంతమైన అంతరాయం లేని విద్యుత్ అందిం చడానికి అవకాశం కలుగుతుంది.

మరియు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో విశాఖపట్నం స్మార్ట్ సిటీ నిధులతో నిర్మించిన కమాండ్ కంట్రోల్ వ్యవస్థకు నిరంతరాయ విద్యుత్‌కు ప్రత్యేక ఫీడర్‌ను కేటాయిం చడం జరిగింది.

ఈ కార్య క్రమంనకు విశాఖ పట్నం పర్యవేక్షక ఇంజనీర్ టి.వి.సూర్య ప్రకాష్, చీఫ్ జనరల్ మేనేజర్, ప్రాజెక్ట్ విజయలలిత ఆధ్వర్యంలో జరిగింది.

ఈ కార్యక్రమంనకు జోన్-1 డివిజనల్ ఇంజనీర్ జనార్ధన్, కనస్ట్రక్షన్ డివిజనల్ ఇంజనీర్ టివియస్‌యన్. మూర్తి, డివిజనల్ ఇంజనీర్ టెక్నికల్ కె.సురేఖ, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ మహేశ్వరరెడ్డి మరియు ఇతర అధికారులు హాజరైనారు.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com

## జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పుస్తకముల పంపిణీ



అన్నవరం : తూ.గో.జిల్లా స్ధానిక రావిచెట్టు సెంటర్ నందు ఉన్న జెడ్పీ హైస్కూల్ నందు బుధవారం విద్యార్థిని,విద్యార్దులకు పాఠ్యాంశాల పుస్తకములను గ్రామ సర్పంచి రాజాల. గంగాభవాణి,ఎమ్మార్వో సుజాత చేతుల మీదుగా పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ స్కూల్ హెడ్ మాష్టారు నిర్మలకుమారి, యుపి స్కూల్ హెడ్ మాష్టారు సుబ్రహ్మణ్యం,రవి మాష్టారు మరియు తెలుగుదేశం టౌన్ ప్రెసిడెంట్ వీర్ల.సూరిబాబు,మండల వైస్ ప్రెసిడెంట్ బొమ్మిడి.సత్తిబాబు, రాజాల.చిట్టిబాబు, మడ్డు.వీరబాబు, బలువు. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## నేడు రత్నగిరిపై మహాచంద్రోత్సవము

అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం నందు నేడు అనగా గురువారం ఉదయం 8-30 ని.లకు ఆయుష్య హోమ మండపము (దర్బారు మండపము) నందు ఏరువాక పౌర్ణమి సందర్భంగా రాష్ట్రంలో రైతుల సస్యాభివృద్ధికి గాను మహాచంద్రోత్సవము చంద్ర జప పారాయణ హోమములు దేవస్థానం పండితులు,అర్చక,పురోహితులతో నిర్వహించబడును. కావున యావన్మంది భక్తులు,గ్రామస్థులు సదరు కార్యక్రమము నందు పాల్గొనవలసిందిగా దేవస్థానం ఈవో ఎమ్.జితేంద్ర కోరడమైనది.

## జూలై 4న సత్యదేవుని హుండీల లెక్కింపు

అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం శ్రీ స్వామివారి తాలూకా హుండీలు ది.4-7-2018 వ తేదీన ఉదయం 7-30ని.లకు తెరచుటకు సదరు సొమ్మును బ్యాంకులో జమచేయుటకు నిర్ణయించడమైనది.

కావున భక్తులకు, గ్రామస్థులకు కార్యనిర్వహణాధికారి ఉత్తర్వులు మేరకు తెలియజేయడమైనది.

## సత్యదేవున్ని దర్శించిన నేషనల్ సఫాయి కమిషన్ చైర్మన్ జగదీష్ హీర్మానీ



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివార్ని నేషనల్ సఫాయి కమిషన్ చైర్మన్ జగదీష్ హీర్మానీ శ్రీ స్వామివార్ని దర్శించి ప్రత్యేక పూజలు చేసారు.ఆయనకు ఆలయ మర్యాదలతో దేవస్థానం ఈవో ఎమ్.జితేంద్ర ఘన స్వాగతం పలికారు.దర్శనానంతరం వేదపండితుల మహాదాశీర్వచనం అనంతరం శ్రీ స్వామివారి ప్రసాదాన్ని, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్ స్పెక్టర్ పోల్నాటి. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ బకాయిదారుల జాబితా విడుదల

యానాం : విద్యుత్ మొండిబకాయిల వసూలుకు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడీ వినూత్న చర్యలు చేపట్టారు. పుదుచ్చేరి వ్యాప్తంగా రూ. 120 కోట్లు పేరుకుపోతున్న నేపథ్యంలో మొండి బకాయిదారుల నుండి వినిమయ ఛార్జీలు వసూలు చేసే నిమిత్తం బకాయిదారుల జాబితాను మంగళవారం పత్రికల్లో ప్రకటించి, రేడియోల్లో ప్రచారం చేయడం మొదలు పెట్టారని అన్నారు. ఆన్‌లైన్‌లో చెల్లిస్తే డిస్‌కనెక్షన్ చేయడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. రూ. 40 లక్షలు మొదలుకొని రూ. 50 వేల వరకు బకాయి ఉన్న 283 మంది బకాయిదారుల జాబితాను విద్యుత్ శాఖ విడుదల చేసింది. ఈ ప్రక్రియ పుదుచ్చేరి వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. యానాంలో వెయ్యి రూపాయలకు మించి బిల్లు ఒక్క నెల బకాయి ఉన్నా సరఫరా నిలిపివేస్తుండడంతో బకాయిదారుల సంఖ్య ఇక్కడ తక్కువ. ప్రజా పనుల శాఖ, మునిసిపాలిటీ వంటి ప్రభుత్వ కార్యాలయాలు చెల్లించవలసిన బకాయి మాత్రం కోట్లలో వుంది.

## ఐటీఐల్లో నేడే క్యాంపస్ ఇంటర్వ్యూలు

యానాం : నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటిఐలో గురువారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్. ప్రభాకర్ తెలిపారు. పుదుచ్చేరి వరల్డ్ పాడ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు ఐటిఐలో శిక్షణ పూర్తి చేసుకున్న అన్ని ట్రేడ్ విద్యార్థులకు గురువారం ఉదయం 9 గంటల నుండి కాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## పాలిథిన్ కవర్లు వాడితే చర్యలు

భీమునిపట్నం : భీమిలి తగరపువలస జోన్ పరిధిలో బజారులో గాని షాపుల్లోగాని ఎవ్వరూ పాలిథిన్ కవర్లు ఉపయోగించ రాదని జోనల్ కమిషనర్ పి.దుర్గా ప్రసాద్ అన్నారు. వాటిని ఎవరైనా ఇక మీదట వాడితే చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.అలాగే ప్రతీ రోజు తడి చెత్త, పొడి చెత్త,లను వేరు వేరుగా పారిశుద్ధ్య కార్మికులకు విధిగా అందించాలని ఆయన కోరారు. ఆయన తగరపువలస, చిట్టివలస జోన్ పరిధి లో ఉన్న సంగివలస , వలంద పేటలలో ఆయన పర్యటించారు. కాలువల్లో రోడ్ల పైన ఉన్న చెత్తలను శానిటరీ సిబ్బంది తొలగించారు.

డెంగ్యూ,మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఆయన తెలిపారు.

## శ్రీ మావుళ్ళ అమ్మవారి జాతీర మహోత్సవాలు



అమలాపురం: అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లి గరువులో వేంచేసిన శ్రీ మావుళ్ళ అమ్మవారి జాతీర మహోత్సవాలను గురువారం రాత్రి ఘనం నిర్వహించనున్నారు. అమ్మవారి తీర్థం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. గురువారం రాత్రి గరగ నృత్యాలు ,డప్పు వాయిద్యాలతో బాణా సంచాలతో జాగారం జరుగుతుంది. తమ ఇంటి ఇలవేల్పుగా కొలిచే శ్రీ మావుళ్ళ అమ్మవారి 29వ తేదీన తీర్థం సందర్భంగా ఉదయం నుండి భక్తులు ఆలయానికి చేరుకుని దర్శించి తమ మొక్కలు చెల్లించుకుంటారు. ఈ జాగర, తీర్థ మహోత్సవాలకు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి తరించాలని గ్రామస్తులు కోరారు.

## స్కూల్‌బ్యాగ్‌లు అందజేసిన జాన్ కుమార్



కాకినాడ/కిర్లంపూడి : తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి మండలం వీరవరం గ్రామంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఉందుర్తి జాన్‌కుమార్ అధ్వర్యంలో సుమారు 50 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేసారు. ఈసందర్భంగా జాన్‌కుమార్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. నిరుపేదలకు చేయూతని వ్వాలనే ఉద్దేశంతో తమ సంస్థ ద్వారా సేవాకార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈకార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు డి.మేరి, కార్యదర్శి డి.గాంధీ,సభ్యులు ఎన్. జోజిబాబు తదితరులు పాల్గొన్నారు.



సంత్ నిరంకారీ ఛారిటబుల్ ఫౌండేషన్ రుషికొండ వారు వాడపాలెం హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు స్కూల్ పుస్తకాలు, స్కూలు బ్యాగులు పంపిణీ చేస్తున్న దృశ్యం. ముఖ్య అతిథి మిరుపురి ప్రేమ్‌జీ. ఈ కార్యక్రమంలో చినదాసు, రవి, పి.వి. రావు, సత్యనారాయణ రాజు, రాము, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



జివిఎంసి 28వ వార్డులో విల్లూరి చినతల్లి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్లిపురం మోడల్ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు, బిస్కెట్లును పంపిణీ చేసిన దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్ కుమార్ తదితరులు. ఈ కార్యక్రమంలో విల్లూరి చక్రవర్తి, విల్లూరి తిరుమలా దేవి, భారతి, హారిక తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి : ఎంఇవో



అమలాపురం : క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఉప్పలగుప్తం మండల విద్యాశాఖాధికారి ఎ.మంగాపతిరావు సూచించారు. కూనవరం ఎంపిపి యుపి స్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు జి.స్వామిప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఇవో మాట్లాడారు. ప్రభుత్వంవారిచే ఉచితంగా పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు, దాతల విరాళాలతో కొన్న స్కూల్ బ్యాగ్‌లు, డైరీలు విద్యార్థులు పంపిణీ చేసారు. దాతలు గిరిప్రియ ఐరన్ అండ్ సిమెంట్స్, అమలాపురం, చిరంజీవ నర్సింగ్ హెూం అధినేత రాధమ్మ, సుబ్రహ్మణ్యం, మెడికల్ స్టోర్ కూనవరం వారు సమకూర్చగా, వీటిని దాతల చేతుల మీదుగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎంఇవో మాట్లాడుతూ విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, డైరీలు సమకూర్చడం పట్ల వారికి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి.వెంకటేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు సుగుణామణి, చిరంజీవ నర్సింగ్ హెూం అధినేత బండి రాధమ్మ, ఎస్ఎంసి ఛైర్మన్ సత్తిరాజు, సిఆర్‌పి నాగలక్ష్మి, గ్రామపెద్దలు ఆకుల తాతారావు, ఎస్.ఏసుబాబు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మోసపోయిన ముత్యాల - మోసగించిన టిడిపి

### రాజీనామాకు సిద్ధం



పెద్దాపురం : తెలుగుదేశం ఆవిర్భావం నుండి దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్‌తో కలసిపని చేశానని, పార్టీ కొరకు జైలు జీవితం కూడా గడిపానని, అమరణ దీక్షలు చేశానని పెద్దాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యాల వీరభద్రరావు (రాజబ్బాయి) తన అనుభవాన్ని చాటుకున్నారు. తన క్రమశిక్షణ, అనుభవం చూసి ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనకు ఎమ్మెల్సీ పదవి ఇప్పిస్తానని మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం విలేఖర్లతో మాట్లాడుతూ వేట్లపాలెం బహిరంగ సభలో యనమల రామకృష్ణుడు తనకు ఎమ్మెల్సీ పదవి ఇప్పిస్తానని చెప్పి ప్రస్తుతం ఎఎంసి చైర్మన్‌గా ఉండమని చెప్పారని అన్నారు. ఆరు నెలలలో మీకు ఎమ్మెల్సీ ఇప్పిస్తానని చెప్పారని, ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు చెప్పినా హామీ ఇచ్చి మోసగించారే తప్ప ఇంతవరకూ పదోన్నతి లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిన్న కాక మొన్న ఇతర పార్టీల వారిని పిలిచి మరీ గౌరవిస్తున్నారని, ఇది చాలా దురదృష్టకరమని అన్నారు, ప్రస్తుతం పెద్దాపురం వ్యవసాయ శాఖ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లినా చలించడం లేదని, రైతులకు రుణాలిప్పించండని వేడుకుంటే కనీస సహాయం కూడా లేకపోవడం ఎంతో దురదృష్టకరమని, కనీసం సరకులు నిల్వ చేసుకుందుకు గోడౌన్‌ను కేటాయించండి అని అడిగినా స్పందన లేదని, రైతులు ఎంతో ఆగ్రహంతో ఉన్నారని ఎంత వేడుకున్నా కనికరించే నాధుడే టీడీపీలో లేకపోవడం దురదృష్టకరమని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని వాపోయారు.

1982 నుండి పార్టీకి సేవలు చేస్తున్నా తన సేవలను గుర్తించలేదు సరికదా, సమ్మక ద్రోహానికి మారుపేరుగా మారిని సీఎం చంద్రబాబు నాయుడు ఉన్నంతకాలం రాజబ్బాయికి సీటు ఇవ్వరని తెలిసిపోయిందే? ఏమోయ? రైతులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తూ మీరు తక్షణమే రాజీనామాకు సిద్ధం కండి అని రైతులు తనపై వత్తిడి తెస్తున్నట్లు ముత్యాలు తెలిపారు.

## కాపు కార్పొరేషన్ ద్వారా రుణాలు

పెద్దాపురం : కాపు కార్పొరేషన్ ద్వారా కాపు ఎస్‌సి, బిసి వర్గాలకు పెద్దాపురంలో గల ఎస్‌బిఐ, ఎడిబి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులు రుణాలు మంజూరుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆయా బ్యాంకుల మేనేజర్లు తెలిపారు.

ఎస్‌బిఐ, ఎడిబికి గాను కట్టమూరు, ఆర్‌బిపట్నం, ఆర్‌బికొత్తూరు గ్రామాలనుండి స్వయం సహాయక రుణాలు పొందడానికి సుమారు 300 మంది 26న, 300 మంది 27న ఇంటర్వ్యూలకు రావడం జరిగిందని బ్రాంచి మేనేజర్ కృష్ణ తెలిపారు. అర్హులైన వారికి రుణాలు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు.

ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు పెద్దాపురం నుండి గండేపల్లి, సూరంపాలెం, యల్లమిల్లి మండలాల నుంచి కాపులు 268 మంది, బి.సి.లు 108 మంది, ఎస్‌సిలు 42 మంది రుణాలకు రావడం జరిగిందని బ్యాంక్ మేనేజర్ శివరామకృష్ణ తెలిపారు.

# పారిశుధ్యకార్మికలుకు రక్షణ కల్పించాలి

### జాతీయ సఫాయి కర్మచారీ కమీషన్ సభ్యులు జగదీష్





కాకినాడ : అపరిశుభ్ర, ప్రమాదకర పరిస్థితులలో పనిచేస్తున్న పారిశుద్య కార్మికులందరికీ రక్షన చర్యలు చేపట్టి ఆహార్యాలు ,ఆచ్ఛేధనలు పంపిణీ చేయాలని జాతీయ సఫాయి కర్యచార్సీ కమీషన్ సభ్యులుజగదీశ్ హీరెమణి మున్సిపల్ అధికారులకు సూచించారు.జిల్లా పర్యటనలో భాగంగా కాకినాడ నగరంలో పారిశుద్య కార్మిక జీవన ఉద్యోగ పరిస్థితులను పరిశీలించారు.జెడ్పీ సెంటర్ పాత బస్ స్టాండ్ సూర్యనారాయణ పురం తదితర ప్రాంతాలలోపర్యటించి పారిశుద్యకార్మికులతో ముచ్చడించారు.కార్మికులందరికీ గ్లౌజులు ,చెప్పులు ముక్కు మాస్కులు తప్పని సరిగా పంపిణీ చేసి వాటిని వాడేలా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆర్టీసి కాంప్లెక్స్‌లో 17ఏళ్ళ బాలుడితో పారిశుద్య పనులు చేయించడం కార్మికులకు కనీస వేతనాలు చెల్లించక పోవడం గుర్తించి కాంట్రాక్టును వెంటనే రద్దు చేయాలని డిపో మేనేజర్‌ను ఆదేశించారు.స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద నగరంలో ప్రవేశ పెట్టిన విద్యుత్ తో నడిచే ఈకార్ శానిటేషన్ వాహనాలను పరిశీలించారు.అనంతరం కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు.పారిశుద్య కార్మికులు తమ సమస్యలను కమీషన్ సబ్యుని దృష్టికి తీసుకొని వెళ్ళారు.కార్పొరేషన్ ద్వారా తమకు వేతనాలు సక్రమంగా అందడంలేదని పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు నెలవారీ ఫించన్ సక్రమంగా ఇవ్వడంలేదని 460 మందికి సుమారు 3కోట్లరూలు బకాయి చెల్లించాల్సి ఉందని పిర్యాదు చేసారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించడం లేదన్నారు.బ్యాక్‌లాగ్ పోస్టులలో రెల్లి కులస్థులకు అన్యాయం జరిగిందని రుణాల మంజూరులో అధికారులు వివక్షత చూపుతున్నారన్నారు.అభివృద్ధిలో తాము వెనుకబడి ఉన్నామని సామాజిక వివక్షత ఎదుర్కొంటూ రాజ్యాంగం కల్పిఇంచన హక్కులు అందక రెల్లి కులస్థుల జీవితాల్లో వెలుగులు లేకుండా పోయాయని పిర్యాదు చేసారు.రాష్ట్రంలో రెల్లి కులస్థులకు ప్రత్యేక నిధుల కేటాయించాలని డిమాండ్ చేసారు.ఈ సందర్భంగా సభ్యులు జగదీష్ హీరేమణి మాట్లాడుతూ సఫాయి కర్మచారుల సంక్షేమానికి కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉందని వీరి అభివృద్ధికి అధికారులు చర్యలు తీసకోవాలని ఆదేశించారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట&కలెక్టర్ డా. ఎ మల్లి కార్జున, అడ్మిన్ ఎస్పీ ఎఆర్ దామోదర్, సోషల్ వెల్ఫేర్ ఈడి శోభారాణి ఎస్సీ కార్పొరేషన్ రఘుబాబు సఫాయి కార్మికుల సంఘం నాయకులు కార్మికులు తదితరులు .

